జనరాజకీయం కోసం... ₹ 10

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి 2 సంచిక - 11 జూన్ 1-15, 2011

పక్షపత్రిక



## ప్రభుత్వమే రైతు ద్రోహి



## బాబు x జగన్

## నివేదిక బరువు - ప్రగతి కరువు







# నల్గొండ జిల్లాలో జేపీ రైతు ఉద్యమ యాత్ర









కడప జిల్లా జి. తిప్పాయపల్లి రైతులతో చర్చావేదిక



కడప జిల్లా గోపులాపురం రైతులతో చర్చావేదిక



కడప జిల్లా పూళ్ళ చెన్నాయపల్లి రైతులతో చర్చావేదిక

జన రాజకీయం కోసం...

లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జూన్1-15, 2011

సంపుటి - 2 సంచిక - 11

## లోపలి పేజీల్లో...


ప్రభుత్వమే రైతు ద్రోహి.................... 5

బాబు x జగన్.......................... 7

స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు రిజర్వేషన్లు.....8

సమస్యలు పట్టని ప్రధాని ప్రగతి నివేదిక.....10

భారతదేశం..........................................13

అంతర్జాతీయ రంగంలో నూతన వేదిక బ్రిక్స్..........................................15

సురవరం ప్రతాపరెడ్డి..............................18

అవీ... ఇవీ..............................................21

యూత్‌ఫోరం....................................... 22

స్వామినాథన్ కమీషన్ సిఫారసులు......... 24

రైతు యువకులతో పెళ్ళికి ఇష్టపడని అమ్మాయిలు........................................ 28

తగ్గుపట్టిన ఆహార ద్రవ్యోల్బణం................. 29

నల్గొండ జిల్లా లేఖ.................................. 30

జిల్లాల సమాచారం.................................. 32



## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్


# పాలన లేని రాష్ట్రం

## సంపాదకీయం

రాష్ట్రంలో ప్రభుత్వం వున్నది. కాని పాలన జాడ కనిపించడం లేదు. మంత్రివర్గం వున్నది, కాని ఏకముఖంగా లేదు. మూడు పక్షాలుగా వ్యవహరిస్తున్నది. ఒకటి విధేయపక్షం కాగా మరొకటి స్వపక్షంలోనే ప్రతిపక్షం. ఇంకొకటి కొత్తగా పుట్టిన వేరే పార్టీ పక్షం. శాసనసభ్యులదీ అదే తీరు. ఈ పరిస్థితిని వారు అనుకూలంగా మల్చుకోడానికి నిత్య అసంతృప్తులతో, అలకలతో పాటు "గోపి" ల పాత్ర పోషిస్తున్నారు. ఎడాపెడా ప్రలోభాల కోసం అర్రులు చాస్తున్నారు.

నిజానికి ఇది ఎన్నుకున్న ప్రజల తప్పు కాదు. ఎన్నికై అధికారాన్ని నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నిర్వాకం ఇది. అది ఒక పార్టీగా వ్యవహరించగల స్థితిని కోల్పోయింది. ఆ పార్టీ అనుసరించిన అవకాశవాద విధానాలు, పొత్తులు, ప్రకటనలు ఇప్పుడు దానికి ఉరితాళ్లు అయ్యాయి. ఆ పార్టీ ప్రాంతాల వారీగా ముక్కలయింది. శాసన సభ్యులే దానికి నాయకత్వం ఇస్తున్నారు. క్రమశిక్షణ బెదిరింపులే కాని తీసుకునే సత్తా ఆ పార్టీ కోల్పోయింది. కాంగ్రెస్ పార్టీలో తలెత్తిన అంతరంగిక లొల్లి ప్రభుత్వాన్ని చుట్టింది. పాలనలేని శాపం రాష్ట్రప్రజలకు మిగిలింది.

రాష్ట్రంలో తెలంగాణా సమస్య అతి సున్నితమైంది. ఈ సమస్యకు సత్వర పరిష్కారాలను వెదకడానికి బదులు దీనిని నాన్చి, నాన్చి బాగా ముదరబెట్టారు. ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో మరింత నాన్పుడుకు పూనుకుంటున్నారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలి. కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో పరిస్థితిని చక్కదిద్దాలి.

అంకెలలో ఆర్థికాభివృద్ధి రేటు కనిపిస్తున్నా, రాష్ట్రం గల్లాపెట్టెలో కాసులు నిండుకున్నాయన్నది స్పష్టం. జీతాలు, పెన్షన్లు తప్ప మరి దేనికీ ఖర్చు చెయ్యలేని స్థితి కనిపిస్తున్నది. సంక్షేమ పథకాలకు కోతలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల లేమి కనిపిస్తున్నది. పాలన స్తంభించింది అనడానికి ఇదో నిదర్శనం.

రాష్ట్రంలో అతి ముఖ్యమైన రైతుల సమస్యల మీద ప్రభుత్వం అచేతనంగా ఉంది. సమస్య తాటికాయంత వుంటే ప్రభుత్వం స్పందన ఆవగింజంతగా వుంది. రాష్ట్రంలో 1,30 లక్షల టన్నుల ధాన్యం పండితే ప్రభుత్వం కొనుగోలు చేసింది. కేవలం 14 లక్షల టన్నులే కావడం పాలనలేనితనాన్ని ప్రస్ఫుటం చేస్తున్నది. కొనుగోలు కేంద్రాలకు గోనెసంచులు కూడా సరఫరా చెయ్యలేని స్థితిలో వుంది. వర్షాకాలం వారంరోజులలోనే ప్రారంభం కానుంది. రైతుల ధాన్యం రోడ్ల మీద, కళ్లాలలో రాసులుగా వున్నాయి. తక్షణం కొనుగోళ్లు చెయ్యకపోతే పండించినా కూడా రైతుకి దండగే అవుతుంది. దీనికంటే దారుణం మరొకటి వుండదు. ధాన్యాన్ని మద్దతు ధరకి కొనండి లేదా మిల్లర్ల ద్వారా కొనిపించాలి. రైతులకు చెక్కుల ద్వారా నేరుగా చెల్లింపులు జరిపించండి. ప్రభుత్వం వుందని నిరూపించుకోండి. ■




*Indianink* సౌజన్యంతో...

# కార్టూన్ కార్నర్

## సెల్‌ఫోన్ యుగంలో.....




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
*ఇం.నం. 5-10-180/ఎ&ఎ1,*
*బ్యాండ్ లేన్స్, హిల్‌ఫోర్ట్ రోడ్,*
*హైదరాబాద్ - 500 004,*
*ఫోన్: 040-2323 1818*
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: *040-2323 1818.*

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# ప్రభుత్వమే రైతు ద్రోహి

## జేపీతో న్యూస్‌టుడే ముఖాముఖి

అన్నదాతకు ధర ఇవ్వాలంటే వినియోగదారుడిని చంపాలని కాదు ఎగుమతులపై ఆంక్షలు తొలగించాలి. వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేయాలి. కర్షక సమస్యలపై పోరాడేందుకు 10 వేలమందికి శిక్షణ ఇవ్వనున్నట్లు డా॥ జయప్రకాష్ నారాయణ్ న్యూస్‌టుడే ముఖాముఖిలో వెల్లడించారు.

రైతులకు ప్రభుత్వమే ద్రోహం చేస్తోందని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ మండిపడ్డారు. రైతుల ప్రయోజనాలు వినియోగదారుల ప్రయోజనాలకు వ్యతిరేకం కాదని పేర్కొంటూ గిట్టుబాటు ధర ఇవ్వడమంటే వినియోగదారుడిని చంపమని కాదన్నారు. వ్యవసాయ రంగంలో ఉన్న వారికి తగినంత ఆదాయమొస్తేనే పరిశ్రమలకు గిరాకీ పెరుగుతుందని, కాబట్టి వ్యవసాయ రంగాన్ని పరిశ్రమలను అనుసంధానం చేయాలన్నారు. పాలకులు పిడివాదాన్ని వదిలి పెట్టి, చేసిన తప్పుల్ని సవరించుకోవాలని కోరారు. దేశంలో ఆహార భద్రతకు విఘాతం కలగకుండా చూసుకుంటూనే ఆహారధాన్యాల ఎగుమతులకు అనుమతించాలని డిమాండ్ చేశారు. రైతులను సంఘటితం చేసేందుకు కొన్ని జిల్లాల పర్యటనలు చేసి వచ్చిన జేపీ 'న్యూస్‌టుడే'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

**ఆహారధాన్యాలను ఎగుమతి చేస్తే దేశంలో ఆహార భద్రతకు ముప్పు వాటిల్లదా?**

**జేపీ :** మెడ మీద తలకాయ ఉన్నవాడెవడూ ఆహార భద్రత చూసుకోవద్దని చెప్పడు. గత పదేళ్లుగా దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి సగటున 20 కోట్ల టన్నులకు తగ్గలేదు. దేశ అవసరాలకు 13 కోట్ల టన్నులు సరిపోతాయి. ఒకవేళ దుర్భిక్షం వచ్చి ఒక ఏడాది పంట మొత్తం దెబ్బతిన్నా కూడా తట్టుకునేంత మిగులు మన దగ్గరుంది. ఆహార భద్రత చట్టం



ఆహారోత్పత్తుల స్వేచ్ఛా వాణిజ్యానికి ఆటంకమే కాదు. దేశ అవసరాలకు సరిపడా ఉంచుకుని మిగిలిన ఆహార ధాన్యాలను గిరాకీని బట్టి ఎగుమతి చేయాలి. అంతర్జాతీయ మార్కెట్‌ను అధ్యయనం చేసి ప్రభుత్వానికి తగిన సూచనలిచ్చేందుకు ఒక సంస్థను కూడా ఏర్పాటు చేయాలి.

**వ్యవసాయ సంక్షోభం నుంచి బయటపడి రైతుల సమస్యలు పరిష్కారం కావాలంట ఏం చేయాలి?**

**జేపీ :** అన్నదాతలను ఆహారం, పరిశ్రమలకు ముడిసరుకులను ఉత్పత్తి చేసే యంత్రాల్లాగానే పాలకులు భావిస్తున్నారు. పాలకుల పాపాల వల్లే వ్యవసాయ సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రభుత్వమే రైతులకు ద్రోహం చేస్తోంది. ప్రపంచంలో ఏ వస్తువును తీసుకున్నా ఎంత ఎక్కువ ఉత్పత్తి చేస్తే అంతలాభం వస్తుంది. డిమాండ్-సరఫరాల మీద ఆ వస్తువు ధర ఆధారపడి ఉంటుంది. వ్యవసాయ రంగంలో మాత్రం ఎంత ఎక్కువ ఉత్పత్తి చేస్తే అంత అధికంగా రైతు నష్టపోతున్నాడు. ఎందుకంటే

అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయోత్పత్తులకు డిమాండ్ పెరుగుతున్నా దానిని ఆంక్షల ద్వారా ప్రభుత్వమే బలవంతంగా అణచివేస్తోంది.

**ఎలా చేస్తే రైతులకు మేలు జరుగుతుంది?**

**జేపీ:** వ్యవసాయ చేస్తున్న పాపానికి రైతు కుటుంబాల నెలసరి ఆదాయం కేవలం రూ॥5వేలు మాత్రమే ఉంటే వ్యవసాయేతర కుటుంబాల నెలసరి ఆదాయం రూ॥40వేలకు చేరింది. ఇది దేశానికి నష్టదాయకం. వాణిజ్యం మీద ఆంక్షలు తొలగించి గిరాకీ పెంచే ప్రయత్నం చేయడమే పరిష్కారం. 2014 ఎన్నికల నాటికి వ్యవసాయం చుట్టూనే మొత్తం రాజకీయం తిరగాలి.

**విధానాల్లో రావాల్సిన తక్షణ మార్పులు ఏమిటి?**

**జేపీ:** పరిశ్రమలకు అన్ని రాయితీలిస్తున్న ప్రభుత్వం వ్యవసాయానికి అలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా ఆంక్షలు విధించి సంకెళ్లు వేస్తోంది. ఎగుమతి, దిగుమతుల విషయంలో సరైన విధానాలను అవలంబించడం లేదు. ఆహారోత్పత్తుల నిల్వకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. దీనివల్ల పండ్లు, కూరగాయలు ధరలు ఒకేసారి పడిపోవడం, ఒకేసారి పెరిగిపోవడం జరగదు. మన రాష్ట్రంలో క్వింటాలు ధాన్యం ధర సగటున రూ॥800 పలుకుతోంది. రెండు క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లింగ్‌చేస్తే ఒక క్వింటాలు బియ్యం వస్తుంది. ఆ ప్రకారం కేజీ బియ్యాన్ని రూ॥16కు అమ్మవచ్చు. మార్కెట్‌లో బియ్యం ధర చూస్తే చుక్కలనంటుతోంది. రైతుకు వినియోగదారుడికి మధ్య దళారీ వ్యవస్థ వెళ్లూనుకోవడమే దీనికి కారణం. ప్రభుత్వం, మిల్లర్ల వ్యవస్థలో అడుగడుగునా అవినీతి పేరుకుపోయింది.

**కొనుగోలు, ఎగుమతులుకూడా ప్రభుత్వమే నేరుగా చేయాలన్న డిమాండు వినిపిస్తోంది. ఇది సాధ్యమేనా?**

**జేపీ :** కొనుగోలు ఎవరు చేసినా కూడా ప్రభుత్వం ఎఫ్‌సిఐ, ఎన్‌టీసి, ఎంఎంటీసీ, పీఈసీల ద్వారా నేరుగా ఎగుమతులు చేయడం వల్ల లాభాలుంటాయి. ఆ లాభాన్ని రైతులకు బోనస్‌గా ఇవ్వవచ్చు. దీనివల్ల మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

**గోదాములు చాలినన్ని లేవు. ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఏం చేయాలి?**

**జేపీ :** ధాన్యం తడిసిపోకుండా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. లెవీకి పరిమితులు లేకుండా కనీస మద్దతు ధరకు అమ్మటానికి రైతులు సిద్ధపడితే ధాన్యం మొత్తాన్ని ఎఫ్‌సీఐతో కొనుగోలు చేయిస్తామని ప్రభుత్వం భరోసా ఇవ్వాలి. ప్రత్యేక అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలి. ఏ నిబంధనలూ అడ్డురాకుండా అవసరాన్ని బట్టి ఖర్చు పెట్టే ఏర్పాటున్న ట్రెజరీ నిబంధన టిఆర్27 కింద ధాన్యం రక్షణ బాధ్యతను అప్పగించాలి. రైతులకు చెక్కుల ద్వారా చెల్లింపులు చేయాలి. చిన్న పట్టణాల్లోనే మార్కెటింగ్, నిల్వ ఏర్పాట్లు చేస్తే ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.

**రైతుల కోసం మీ కార్యాచరణ ఏమిటి?**

**జేపీ :** ఇప్పటికే మా కార్యక్రమాలతో కొన్ని ప్రయోజనాలు కలిగాయి. స్వతంత్ర రైతు సంఘాలతో కలిసి మేం చేపట్టిన ఉద్యమం వల్ల రాష్ట్రం నుంచి 55 లక్షల బేళ్ల పత్తి ఎగుమతికి అనుమతించారు. డిమాండ్ల సాధనకు రైతులను సంఘటితం చేస్తున్నాం. సమస్యలపై పోరుకు రాష్ట్ర వ్యాప్తంగా 10వేల మందికి శిక్షణ ఇస్తాం. గ్రామం, మండలం, జిల్లా స్థాయిల్లో శిక్షణ పూర్తిచేశాక, దేశవ్యాప్తంగా భారీ రైతు ఉద్యమాన్ని మొదలు పెడతాం. ■

## పంట విరామానికి సన్నద్ధమవుతున్న రైతులు

తూర్పుగోదావరి జిల్లా కోనసీమలోని పలు మండలాలకు చెందిన రైతులు వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం పంటకు విరామం ఇవ్వాలని తీర్మానించు కుంటున్నారు. ధాన్యానికి లాభసాటి ధర కల్పించటంలో ప్రభుత్వం విఫలం కావటం పట్ల వారు తీవ్రమైన ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో అమలాపురంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించి తమ నిరసనను వ్యక్తం చేశారు. జూన్ 5వ తేదీ నుండి పంట విరామ రైతు చైతన్య యాత్రను జిల్లాలో నిర్వహించాలని తలపెట్టారు.

అల్లవరం మండలం బెండమూర్లంక నుండి ప్రారంభించి జూన్ 10వ తేదీన పశ్చిమగోదావరి జిల్లాలో ముగించాలని నిర్ణయించారు. వచ్చే ఖరీఫ్ పంట సాగుచేయబోమని రైతులు ప్రతిజ్ఞ చేశారు.

ప్రకాశం జిల్లా కారంచేడు రైతులు కూడా ఇదే దారి పట్టనున్నట్లు ప్రకటించారు. కృష్ణాజిల్లాలో పలుచోట్ల జరిగిన రైతు సమావేశాలలో పంట విరామం తప్ప మరో మార్గం లేదని ప్రకటిస్తున్నారు.

# బాబు X జగన్

## సవాళ్లు ప్రతి సవాళ్లు దేని కోసం?



ఒకరు చంద్రబాబునాయుడు మహానాడులో వున్నారు. మరొకరు జగన్ – ఓదార్పు యాత్రలో వున్నారు. ఇద్దరిదీ ఒకటే లక్ష్యం. ముఖ్యమంత్రి కుర్చీని దక్కించుకోవడం. ఒకరు కడప ఎన్నికల విజయవిలాసంలో వున్నారు. మరొకరు గత రెండు ఎన్నికలలో పరాజయాలతో, తెలంగాణా ఉపఎన్నికలు, కడప ఎన్నికలలో డిపాజిట్లు కోల్పోయిన పరాభవంతో వున్నారు. వీరిలో ఏ ఒకరు అధికారంలోకి రావాలన్నా కాంగ్రెస్‌ను ఓడించాలి. ఇద్దరూ కాంగ్రెస్‌తో తలపడాల్సినవారే. కాని ఇప్పుడు కాంగ్రెస్‌ను పక్కన పెట్టి ఈ ఇద్దరూ ఒకరితో ఒకరు తలపడుతున్నారు. శత్రువు శత్రువు మిత్రుడు కావాల్సిందిపోయి శత్రువులయ్యారు. సవాళ్ల కత్తులు విసురుకుంటున్నారు. ఇది కాస్త విడ్డూరంగా కనిపించినా వారి అధికార క్రీడ రాజకీయానికి తప్పనిసరి.

ఇటీవల ముగిసిన ఐ.పి.యల్ క్రికెట్‌లో 'ప్లే ఆఫ్' క్రికెట్‌ని చూశాం. ఫైనల్లో కాంగ్రెస్‌తో తలపడడానికి ముందు ఈ ఇద్దరూ తమలో తాము తేల్చుకోవడం అవసరంగా భావిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా వున్న తెలుగు దేశాన్ని పక్కకి తోసేస్తే జగన్‌కు దారి సుగమం అవుతుందని వారు భావిస్తున్నారు. జగన్‌ని అడ్డుకుంటే తనే ప్రధాన పోటీ దారుగా మిగులుతానని తెలుగుదేశం అధినేత తలపోస్తున్నారు. ఇది ఆధిపత్యపోరు మాత్రమే. ఇందులో సవాళ్లు ప్రతిసవాళ్లు, మాటల తూటాలు ఒక ఘట్టం మాత్రమే. రైతుల సమస్యలు, బడుగుల ప్రయోజనాలు కేవలం ఈ ఆటలో పావులు మాత్రమే. ఇది రాజకీయాన్ని మార్చే ఆట కాదు. అధికారాన్ని దక్కించుకునే వేట మాత్రమే.

### తొందరలో జగన్

జగన్ ఆధారపడింది పేదలలో తన తండ్రికి వున్న సానుభూతి మీద. దానిని నిరంతరం ప్రభావింపజెయ్యడానికి ఎడతెరిపి లేకుండా ఓదార్పు యాత్రలు సాగిస్తున్నారు. ఈ సుడిగాలి పల్చబడితే జగన్ తేలిపోతాడు. కడపలో సాధించిన మెజారిటీ చాలా మందిలో ఆసక్తిని పెంచింది. ఈ వేడి చల్లారిపోతే అది చప్పబడి పోతుంది. అందుకే ఈ వేడి, ఈ గాలి వుండగానే ఎన్నికలు రావాలని ఆరాటపడుతున్నారు. కాని ప్రభుత్వాన్ని పడకొట్టే శక్తి ఆయనకు లేదని అందరికీ తెలుసు. అయినా తెలుగు దేశం పార్టీని ఇరకాటంలోపెట్టి దానిని సాధించుకోవాలని ఆయన సవాళ్లు విసురుతున్నారు. ఈ ప్రభుత్వం ఎంతతొందరగా పడిపోతే ప్రజలకు అంతమేలు అంటూ జగన్ చేస్తున్న వ్యాఖ్యలతో ప్రజల ప్రయోజనాల కంటే తన ప్రయోజనాలే మిన్నగా కనిపిస్తున్నాయి.

### చంద్రబాబుకి సమయం కావాలి

తెలంగాణాలో డీలా పడ్డ తెలుగుదేశం పార్టీ నాగం తిరుగుబాటుతో అయోమయంలో పడింది. నాగంను ఏకాకి చెయ్యడంలోనూ, కరీంనగర్ రణభేరితోనూ కొంత విశ్వాసాన్ని పెంచగలిగారు.

మూలిగేనక్క మీద తాటిపండు పడ్డట్టు అసలే తన నాయకత్వాన్ని సవాలు చేస్తున్న కాలంతో హరికృష్ణ ఇంటి పోరుకు తెర తీశారు. ఇది హరికృష్ణకు తగిన సమయమే కావచ్చుగాని చంద్రబాబుకు కొత్త సమస్యగా మారింది. తన వారసుల్ని ముందుకు నెట్టడానికి తెరవెనక చేస్తున్న ప్రయత్నాలకి ఎదురుదెబ్బ తగిలింది. ఇక సీమాంధ్రలో కాంగ్రెస్‌లో జగన్ చీలిక తనకి లాభిస్తుందనుకుంటే కడప ఎన్నికల ఫలితాలు, డిపాజిట్టు దక్కని పరిస్థితి ఆ పార్టీ శ్రేణులతో నిరుత్సాహాన్ని నింపింది. ఈ స్థితిలో ప్రభుత్వాన్ని పడగొట్టడం తనకు శ్రేయస్కరం కాదని చంద్రబాబుకి తెలుసు. అందుకే ఆయన ఆ ఉచ్చులో పడకుండా ఎదురు దాడికి దిగాల్సి వచ్చింది.

మొత్తం మీద మహానాడులో ఆయన స్వరం మారింది. వేషం మారింది. గతంలో జరిగిన తప్పులకి మరోసారి వివరణలు సమాధానాలూ ఇచ్చుకున్నారు. ఇవన్నీ సమయం కోసం చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలుగా కనిపిస్తున్నాయి. మొత్తం మీద మహానాడు తెలుగుదేశం పార్టీకి స్వయంశక్తిని ప్రసాదించకపోయినా తాత్కాలిక బూస్టర్‌గా వినియోగపడినట్లు కనిపిస్తున్నది. ■

# స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు - బి.సి రిజర్వేషన్లు

- కటారి శ్రీనివాసరావు

మున్సిపాలిటీలకు, పంచాయితీలకు రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు జరిపించాలన్న ధ్యాసకంటే రాష్ట్ర ప్రభుత్వానికి వాటిని ఎలా వాయిదా వెయ్యాలన్న తలంపే హెచ్చుగా వున్నట్టు కనిపిస్తున్నది.

రాష్ట్రంలో 108 మున్సిపాలిటీలలో 85 మున్సిపాలిటీలకు, 16 కార్పొరేషన్లలో 10 కార్పొరేషన్లకు 2010 సెప్టెంబరులోనే ఎన్నికలు జరపాల్సి వుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం వాటిలో స్పెషల్ ఆఫీసర్ల పాలన సాగిస్తున్నది. ఇప్పుడు పంచాయితీలకు జూలై-ఆగస్టులలో ఎన్నికలు జరపాల్సి వుంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ హడావుడి చేస్తే ప్రభుత్వం ఇప్పుడు బి.సి.రిజర్వేషన్ల సమస్యను ముందుకు తెచ్చింది.

సుప్రీంకోర్టు 2010 మే నెలలోనే స్థానిక ప్రభుత్వాల ఎన్నికలలో రాజకీయ రిజర్వేషన్లమీద తీర్పుచెప్పింది. విద్యా, ఉపాధిరంగాలలో రిజర్వేషన్లకీ, రాజకీయ రంగంలో రిజర్వేషన్లకీ తేడా వుందని ఈ తీర్పులో పేర్కొంది.

## సుప్రీంకోర్టు తీర్పులో నాలుగు ముఖ్యమైన అంశాలు

1. స్థానిక ప్రభుత్వాలలో అంటే మున్సిపాలిటీలు, పంచాయితీలలో యస్.టి, యస్.సి, బి.సిలకు ఇచ్చే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించి ఉండకూడదని స్పష్టం చేసింది.

   - అయితే నిర్దిష్ట గిరిజన ప్రాంతాలలో ఎస్.టిల రిజర్వేషన్లకు మాత్రం మినహాయింపునిచ్చింది.

2. విద్యారంగం రిజర్వేషన్లలో బి.సిలకు క్రీమీ లేయర్ వుండి తీరాలని చెప్పిన సుప్రీం కోర్టు రాజకీయ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్‌ను పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం లేదని పేర్కొంది.
3. ఉపాధి రంగంలో ఒకే ఒక పోస్టు వున్నప్పుడు దానికి రిజర్వేషన్ వర్తించకపోవడాన్ని పేర్కొంటూనే స్థానిక ప్రభుత్వాలలో సర్పంచ్, మండలాధ్యక్షులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్, జిల్లా పరిషత్ ఛైర్మన్ పోస్టులు ఒక్కటే వున్నా వాటికి రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొంది.
4. మహిళల రిజర్వేషన్ల కోటాను ఈ తీర్పు పట్టించుకోలేదు. అంటే వారి కోటాను పరిమితి నుండి మినహాయించినట్లు అయింది.

ఈ తీర్పు ప్రకారం ఎస్.టి,ఎస్.సి, బి.సి వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదు. రిజర్వుడుస్థానాలలో పోటీచేసే బి.సి అభ్యర్థులకు క్రీమీలేయర్ వర్తించదు. స్థానిక ప్రభుత్వాలలోని పదవులన్నీ రిజర్వేషన్ల పరిధిలో వుంటాయి. మహిళల కోటామీద ఎలాంటి ఆంక్షలు పెట్టలేదు.

## ఎస్.టి,ఎస్.సిలకు జనాభాప్రాతిపదిక

రాజ్యాంగం ప్రకారం ఎస్.టి, ఎస్.సిలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇచ్చి తీరాలి. బి.సి.లకు జనాభా ప్రాతిపదికన కాకుండా కోటా ప్రాతిపదికన రిజర్వేషన్లు వుంటాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో ఎస్.టి,ఎస్.సి,బి.సిలకు కల్పించిన మొత్తం కోటా 50శాతానికి మించవుంటే దానిని 50శాతానికి తగ్గించుకోవలసి వస్తుంది. ఎస్.టి,ఎస్.సిలకు జనభా ప్రాతిపదిక వున్నందున వారికి దక్కే రిజర్వేషన్లు కుదించడానికి వీలు పడదు. ఆ మేరకు బి.సిల కోటాను కుదించుకోవలసి వస్తుంది.

## మున్సిపాలిటీలలో ఢోకాలేదు

సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో కూడా మున్సిపాలిటీలలో బి.సి.కోటాకు ఎలాంటి ఢోకాలేదు. ఎందుకంటే పట్టణాలు నగరాలలో ఎస్.టి శాతం 2 గానూ, ఎస్.సి శాతం 12 గానూ వుంది. బి.సి.లకు ఇచ్చిన కోటా 33.33 శాతంగా వుంది. ఈ మూడూ కలిపినా 47.33 శాతం మాత్రమే అవుతున్నది. అందువల్ల మున్సిపల్ ఎన్నికలను పాత రిజర్వేషన్లకు అనుగుణంగా జరుపుకోవచ్చును.

## పంచాయితీలకే చిక్కు

సుప్రీంకోర్టు తీర్పు పంచాయితీ ఎన్నికలలో రిజర్వేషన్లను ప్రభావితం చేసేదిగా వుంది. జనాభా ప్రాతిపదిక మీద ఎస్.టిలకు 8.25శాతం, ఎస్.సి.లకు 18.30 శాతం సీట్లు వారికి రిజర్వు చేసితీరాలి. ఇకపోతే బి.సిలకు చట్టప్రకారం 34శాతం సీట్లు రిజర్వు చెయ్యాలి. అంటే మొత్తం రిజర్వుడు స్థానాల శాతం 60.55కు చేరుతుంది. సుప్రీంకోర్టు తీర్పువల్ల

10శాతం తగ్గించాలంటే దానిని బి.సి.లకోటా నుండి మాత్రమే తగ్గించాలి. అంటే బి.సిలకు 34శాతానికి బదులు 24శాతం మాత్రమే మిగులుతాయి.

**పాతకోటాకి రాష్ట్ర ప్రభుత్వం సై**

బి.సిలకు 34 శాతం రిజర్వేషన్లను అన్ని పార్టీలు సమర్ధి స్తున్నాయి. తగ్గించకూడదని కూడా అన్ని పార్టీలు భావిస్తు న్నాయి. అయితే సుప్రీం కోర్టు తీర్పును అధిగమించడం ఎలాగ అన్నదే అందరి ముందున్న సమస్య.

సుప్రీంకోర్టు తీర్పు పర్యవసానంగా బి.సి రిజర్వేషన్ల తగ్గింపుపై బి.సి.వర్గాలలో వస్తున్న నిరసనలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టుతీర్పుకు అనుగుణంగా బి.సిల రిజర్వేషన్ల తగ్గింపును విరమించుకుని, పాత కోటా ప్రకారమే ఎన్నికలు జరిపిస్తామని ప్రకటించింది. సుప్రీంకోర్టు నిర్ణయం కర్నాటకకే తప్ప ఈ రాష్ట్రానికి వర్తించదని ప్రభుత్వం పేర్కొంటున్నది. ఒక రాష్ట్రానికి వర్తించిన సుప్రీంకోర్టు తీర్పు అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందని అందరికీ తెలుసు ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే ఎన్నికలు ఆగిపోయే అవకాశం వుందని కూడా ప్రభుత్వానికి తెలుసు. అయినా ప్రభుత్వం తన చేతికి మట్టి అంటకుండా తాము బి.సి కోటాకు వ్యతిరేకులం కాదని ప్రకటించుకోడానికి, ఒక వేళ కోర్టు దీనిని తిరస్కరిస్తే ఎన్నికల వాయిదాకు ఆదే సాధనం అవుతుందని వారు ఆశిస్తున్నారు. మొత్తంమీద పంచాయితీ ఎన్నికల మీద కొంత అనిశ్చితి కనిపిస్తున్నది.

ఏమైనా పంచాయితీలలో బి.సికోటా 34 శాతం తగ్గకుండా ఎన్నికలు జరిపించాలి. ■

# మరుగుదొడ్లకూ కొరతే!

## నగరాలు, పట్టణాల్లో జనం దుస్థితిదీ...

## పురపాలకశాఖ సర్వేలో వెల్లడి

పేరకు పట్టణాలు.. నగరాలవి... ఎత్తైన భవనాలు.. ఆధునిక జీవితంతో అలరారుతుంటాయనుకుంటాం.. కానీ ఆ నగరీకరణ వెనుక దాగున్న గుడిసెల్లో కనీసం మరుగుదొడ్లూ లేని దుస్థితి రాష్ట్రంలో నెలకొంది. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో దాదాపుగా నాలుగో వంతు మందికి ఆ సౌకర్యమే లేదట... సమీకృత అత్యల్ప వ్యయ మరుగుదొడ్ల పథకం (ఐఎల్‌సీఎస్) కింద కొత్తగా మరుగుదొడ్లను మంజూరు చేసేందుకు వీలుగా పురపాలకశాఖ ఇటీవల 124 పట్టణాలు, నగరాల్లో జరిపిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న ప్రతి నాలుగు కుటుంబాల్లో ఒక కుటుంబానికి మరుగుదొడ్డి లేదు. మురికివాడల్లోనే కాదు... మురికివాడేతర ప్రాంతాల్లోనూ మరుగుదొడ్లు లేని విషయం తేలింది. రాష్ట్ర రాజధానికీ ఈ దుర్గతి తప్పలేదు. సర్వేలో ఇంకేం తేలిందంటే... రాష్ట్రవ్యాప్తంగా 18.50 లక్షల కుటుంబాలను సర్వేచేయగా... 5.03 లక్షల కుటుంబాలకు మరుగుదొడ్లు లేవు. పట్టణాల్లో 24,582 కుటుంబాలకు నేటికీ సర్కారు మరుగుదొడ్లే దిక్కు. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ 62వేల కుటుంబాలకు శాశ్వత మరుగుదొడ్లు లేవు.

**జిల్లాలవారీగా మరుగుదొడ్లు లేని కుటుంబాల వివరాలివీ...**

| జిల్లా | మున్సిపాలిటీలు, నగర పాలికలు | మరుగుదొడ్లులేని కుటుంబాలు |
|---|---|---|
| అదిలాబాద్ | 7 | 30,103 |
| అనంతపురం | 7 | 36,766 |
| చిత్తూరు | 8 | 30,099 |
| తూ.గోదావరి | 9 | 17,679 |
| గుంటూరు | 13 | 42,751 |
| కడప | 7 | 27,142 |
| కరీంనగర్ | 6 | 6,376 |
| ఖమ్మం | 6 | 14,820 |
| కృష్ణా | 6 | 6,273 |
| కర్నూలు | 5 | 39,503 |
| మహబూబ్‌నగర్ | 4 | 11,503 |
| మెదక్ | 5 | 8,157 |
| నల్గండ | 4 | 10,296 |
| నెల్లూరు | 4 | 21,197 |
| నిజామాబాద్ | 4 | 10,005 |
| ప్రకాశం | 4 | 16,895 |
| రంగారెడ్డి | 2 | 3,443 |
| శ్రీకాకుళం | 5 | 22,178 |
| విశాఖపట్నం | 3 | 35,509 |
| విజయనగరం | 4 | 25,415 |
| వరంగల్ | 2 | 13,915 |
| ప.గోదావరి | 8 | 11,578 |

# సమస్యలు పట్టని ప్రధాని 'ప్రగతి' నివేదిక

**- డి.వి.వి.యస్. వర్మ**

యూపీయే – 2 తన రెండేళ్లపాలన పూర్తి చేసుకుంది. ప్రతి సంవత్సరం తమ ప్రభుత్వపాలన మీద ప్రధాని వార్షిక నివేదికను ప్రకటిస్తున్నారు. ఈ ఏడాది మే 22న యీ ప్రగతి నివేదికను విడుదల చేశారు. ఈ నివేదిక ఆధారంగా తమ ప్రభుత్వపాలన మీద ప్రజలు, పత్రికలు, విశ్లేషకులు తీర్పు చెప్పాలని కోరారు. ఈ నివేదిక మంచిచెడ్డల్ని పరిశీలించే ముందు ఒకమాట చెప్పాలి. వార్షిక నివేదికను క్రమం తప్పకుండా విడుదల చేస్తున్నందుకు, అలాంటి ఉత్తమ ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని నెలకొల్పినందుకు ముందుగా ప్రధానిని అభినందించాలి. ఇలాంటి పద్ధతిని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, మున్సిపాలిటీలు, పంచాయితీలు విధిగా పాటించి తీరే ఏర్పాటు జరగాలి. ఇది ప్రజల సాధికారతను, ప్రభుత్వాల జవాబుదారీతనాన్ని పెంచుతుంది.



**2011 మే 22న యూపీయే - 2 వార్షిక ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న ప్రధాని మన్మోహన్ సింగ్, యూపీయే ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, భాగస్వామ్య పక్షాల నేతలు**

ఈ సంవత్సరకాలం యూపీయే ప్రభుత్వానికి చాలా గడ్డుకాలం. సాధించినది చెప్పుకునే దానికంటే సమాధానాలు చెప్పుకోవలసిందే ఎక్కువగా వున్న కాలం. స్కీముల ప్రభుత్వం కాస్తా స్కాముల ప్రభుత్వంగా పేరు తెచ్చుకుంది. ప్రధానితో సహా మొత్తం ప్రభుత్వం ప్రతిష్ట మసకబారిన కాలం ఇది. అందుకే ఈ నివేదికను విడుదల చేస్తూ ప్రధానమంత్రి, యూపీయే ఛైర్ పర్సన్ సోనియాగాంధీలు అవినీతిపై యుద్ధాన్ని ప్రకటించాల్సి వచ్చింది. ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించాల్సివచ్చింది.

స్వతంత్ర భారత చరిత్రలోనే ఇంతటి పెద్ద స్కాములు ఏనాడు వెలుగు చూడలేదు. లక్షలకోట్లకు సంబంధించిన 2జి స్పెక్ట్రమ్, కామన్‌వెల్త్‌క్రీడల అవినీతి, ఆధార్‌లో అవినీతి కుంభకోణాలు వరుసగా వెల్లువెత్తాయి. యూపీయే ప్రభుత్వాన్ని ఇవన్నీ బోనులో నిలబెట్టాయి. చేతులకాలాక ఆకులు పట్టుకున్న చందంగా ప్రభుత్వం ప్రజాఒత్తిడికి తలొగ్గి వ్యవహరించాల్సి వచ్చింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రిని మార్చడం, తమ పార్టీలో విశ్వాసపాత్రుడుగా చెలామణీలో వున్న కల్మాడీకి కటకటాలు చూపించడం, తమ ప్రభుత్వం పతనమౌతుందన్న శంక వెంటాడుతున్నా డి.యం.కె. రాజాను కేంద్రమంత్రివర్గం నుండి తొలగించడం, కేసుల్ని బిగించి జైలుపాలు చెయ్యడం అందులో భాగంగా తమ మిత్రపక్షనేత కరుణానిధి కుమార్తెను కూడా కారాగారానికి పంపడం జరిగాయి. ఇలా కాకుండా ప్రారంభంలో చేసినట్లే బుకాయింపులకీ, ఆత్మసమర్థనకీ పూనుకునివుంటే ఈ ప్రభుత్వం మరింత అభాసుపాలై వుండేది.

ప్రజల దృష్టిలో పాలించే అర్హతను కోల్పోయి వుండేది. అలాగే జనలోక్‌పాల్ బిల్లు కోసం అన్నా హజారే దీక్షకు సానుకూలంగా స్పందించడం కూడా అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వానికి పరోక్షంగా మేలు చేసింది.

అయితే వీటిని అవినీతిపై తాము సాధించిన విజయాలుగా ప్రభుత్వం చెప్పుకునే వీలు లేదు. ఇందులో ప్రభుత్వం చొరవ కంటే ప్రజాభిప్రాయానికి ప్రభుత్వం తలవంచడం కనిపిస్తుంది. ఏమైనా ఈ చర్యల వల్ల ప్రభుత్వానికి ఊపిరి పీల్చుకునే సమయం దొరికింది. మరొక పక్క ఈ పరిస్థితిని అందిపుచ్చుకోవలసిన ప్రధాన ప్రతిపక్షం బి.జె.పి అందులో సఫలం కాలేకపోయింది. బి.జె.పి. కి తన కర్నాటక ప్రభుత్వమే గుదిబండ అయింది. కర్నాటక లో గాలి సోదరులతో వ్యవహరించిన తీరు యడ్యూరప్ప అవినీతిని వెనకేసుకుని రావడంతో అవినీతి మీద పోరాడే నైతిక శక్తిని ఆ పార్టీ కోల్పోయింది. మరోపక్క బెంగాల్, కేరళలో పరాజయం పాలైన వామపక్షం ఎదురు దాడి చేయగల స్థితిలో లేదు. ఈ పరిస్థితులు యూపియే ప్రభుత్వానికి పరోక్షంగా కొంత ఊరటనిస్తున్నాయి. మధ్యంతర దిద్దుబాటుకు అవకాశాన్ని ఇస్తున్నాయి. లేకపోతే ముప్పేట దాడిలో ఈ ప్రభుత్వం పుట్టి మనిగిపోయివుండేది.

ఈ నివేదికలో పాలనలో, కాంట్రాక్టులలో పారదర్శకతను తెస్తామన్న సంకల్ప ప్రకటనలు తప్ప నిర్దిష్ట చర్యలు శూన్యం. అవినీతిని మొగ్గలోనే తుంచెయ్యడానికి, స్కాములుగా మారిన స్కీముల్ని, కుంభకోణాలుగా మారిన కాంట్రాక్టుల వ్యవస్థల్ని ప్రక్షాళన చెయ్యడానికి నేరస్తులు ఎంతటి వారైనా తప్పించుకోలేదన్న భరోసాను ఈ నివేదిక ఇవ్వడం లేదు.

## సంతుల అభివృద్ధి ఆకాంక్షేనా

ప్రధాని తన వార్షిక నివేదికలో ప్రభుత్వం అన్ని వర్గాలకీ ప్రయోజనం చేకూర్చే సంతుల అభివృద్ధి సాధిస్తున్నట్టు చెప్పుకున్నారు. ఇది వారి ఆకాంక్షే తప్ప ఆచరణ దానికి భిన్నంగా వుంది. ప్రపంచం అంతటా ఆర్థిక మాంద్యం నెలకొన్న నేపథ్యంలో కూడా తమ ప్రభుత్వం 8.5 శాతం వృద్ధిరేటును సాధించిందని ప్రధాని స్వయం ప్రశంసలు చేసుకున్నారు. నిజమే ఈ అభివృద్ధి రేటును ఎవరూ తక్కువగా చూడరు. కాని ఈ వృద్ధిరేటు సంతుల అభివృద్ధిగా పేర్కొనడం హాస్యాస్పదం. దేశంలో పట్టణాలకీ, గ్రామాలకీ మధ్య అభివృద్ధిలో అంతరం పెరుగుతున్నది. పేదరిక నిర్మూలనాపథకాలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. దారిద్ర్యరేఖకు దిగువున వున్న వారిసంఖ్య వృద్ధిరేటుకు అనుగుణంగా తగ్గడం లేదు. అలాగే విద్యా ఆరోగ్యరంగాలు ప్రాథమిక స్థాయిలో నానాటికి తీసికట్టు అవుతున్నాయి. సాధిస్తున్న ఆర్థికాభివృద్ధికీ దేశంలో మానవాభివృద్ధికీ మధ్య పొంతన లేనితనాన్ని ప్రధాని పూర్తిగా విస్మరించారు. ఈ వృద్ధిరేటు అంకెలు ప్రపంచదేశాలలో చెప్పుకోడానికి పనికివస్తుందే గాని దేశ ప్రజల్ని సంతృప్తిపరిచేది మాత్రం కాదు.

## సంక్షోభంలో వ్యవసాయరంగం

ప్రధాని తన వార్షిక నివేదికలో వ్యవసాయరంగం 5.4 శాతం వృద్ధిరేటు సాధించిందనీ, రైతుల పంటలకు కనీసమద్దతు ధరలను పెంచామనీ, గోధుమలు, ధాన్యం ఉత్పత్తి పెంచడానికి జాతీయ ఆహారభద్రతామిషన్ ఏర్పాటు చేశామని, రాష్ట్రీయ కృషి వికాస్ పథకం ద్వారా వ్యవసాయరంగంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామని ఏకరువు పెట్టారు. వ్యవసాయరంగంలో వృద్ధిరేటు రైతుల ఆదాయవృద్ధిరేటుగా మారడంలేదని, పంటలకు కనీస లాభసాటి ధర లేకపోగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా రైతులకు దక్కడం లేదనీ, అప్పుల ఊబిలో చిక్కుకుని రైతులు ఆత్మహత్యలకు దిగుతున్నారన్న వాస్తవాలను ఆయన పూర్తిగా విస్మరించారు. ఈ ప్రభుత్వమే స్వామినాథన్ కమిషన్‌ను నియమించింది. ఆయన తన నివేదికను 2006లోనే సమర్పించారు. వ్యవసాయరంగం వృద్ధిరేటుతోపాటు రైతుల ఆదాయ వృద్ధిరేటునీ ప్రభుత్వం ప్రతిఏటా ప్రకటించాలని సిఫారసు చేశారు. అలాగే పంటల కనీస మద్దతు ధర నిర్ణయించడం కేవలం ఉత్పత్తి ఖర్చులకే పరిమితం కాకుండా దాని మీద 50 శాతం అదనంగా కలిపి ప్రకటించాలని అప్పుడే కనీస మద్దతు ధర కనీస లాభసాటి ధర అవుతుందని నిగ్గుతేల్చారు. ఎగుమతి, దిగుమతి వ్యాపారం రైతులకు అనుకూలంగా వుండాలని సూచించారు. ప్రధాని తన నివేదికలో రైతుల కోసం పేర్కొన్న అంశాలలో వీటికి చోటు దొరకలేదు. రైతులకు ఆదాయ భద్రత లేకుండా ప్రభుత్వం తలపెట్టిన ఆహారభద్రత సాధించడం అసాధ్యం. దేశ అవసరాలకి మించి ఆహారధాన్యాల ఉత్పత్తులు, నిల్వలు పేరుకుపోయి వున్నప్పటికీ ప్రభుత్వం తన సంస్థల

ద్వారా ఎగుమతులు చేసి రైతులకు లాభాలను బోనస్‌గా ఇవ్వడానికి బదులు ఎగుమతులపై నిషధాన్ని కొనసాగిస్తున్నది. పేరుకుపోయిన నిల్వలతో ఆహారధాన్యాల మార్కెట్ స్తంభించిపోయింది. పంటధరలు పడిపోయి రైతులు నష్టపోతున్నారు.

దేశంలో 50-60 శాతం మంది ప్రజలకు ప్రధానజీవనోపాధిగా వున్న వ్యవసాయరంగాన్ని ఉపేక్షించి, రైతులకు వ్యవసాయం లాభసాటి కాకుండా చేసి సమతుల అభివృద్ధి ఎలా సాధిస్తారో ప్రధానమంత్రే వివరించాలి.

## స్థిరత్వమా ! జడత్వమా

యూపీయే ప్రభుత్వం దేశానికి స్థిరమైన పాలన అందిస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. గత ఏడాది పాలనకు ఇది ఏ మాత్రం వర్తించదు. పార్లమెంటు సమావేశం ఒక సెషన్ పూర్తిగా జరగకుండా స్తంభించింది. పరిపాలన జడత్వంలో పడింది. స్థిరత్వమూ, జడత్వమూ ఒకటి కాదని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ ప్రభుత్వానికి స్వంత చొరవలు కరువయ్యాయి. సుప్రీంకోర్టు అక్షింతలు పడకుండా ఏ పనీ చెయ్యలేని నిస్సహాయ స్థితికి చేరింది. నల్లధనం మీద, స్పెక్ట్రమ్ మీద, సి.వి.సి. నియామకం మీద ,ఆహార ధాన్యాల నిల్వలమీద సుప్రీకోర్టు తీర్పుల అనంతరం మాత్రమే చర్యలే చేపట్టే ప్రభుత్వంగా మారింది. విధాన నిర్ణయాలు తీసుకోవలసిన ప్రభుత్వం అచేతనంగా వుండడంతో ఆ పనిని కోర్టులు చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి ఇంతకంటే దుస్థితి మరొకటి వుండదు. అందుచేత జడత్వంలో వున్న ప్రభుత్వం దానిని స్థిరత్వంగా చాటుకోవడం కంటే విడ్డూరం మరొకటి వుండదు.

## చక్కదిద్దుకోకపోతే సాగనంపుతారు

ప్రభుత్వం తన ప్రగతి నివేదికను ప్రకటిస్తే కొన్ని పత్రికలు, ఛానళ్లు ప్రజల నివేదికను సర్వేల రూపంలో ఇచ్చారు. తన నివేదిక కంటే ఈ ప్రజాభిప్రాయానికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇవ్వాలి. ప్రజలు నిర్ద్వంద్వంగా ధరల పెరుగుదలను నిరసించారు. అవినీతి మీద ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం అమలు పైనా, వైద్యసేవల అందుబాటుపైనా అవిశ్వాసాన్ని ప్రకటించారు. వ్యవసాయ రంగాన్ని విస్మరించారని ప్రకటించారు. అ ప్రజావాణి ప్రభుత్వానికి కనువిప్పు కావాలి. మరొకపక్క ప్రతిపక్షనేతల కంటే కాంగ్రెస్‌నేతల పట్ల కొంత మొగ్గు కూడా చూపారు. ఇదే యూపియే - 2 కి ప్రజలిస్తున్న హెచ్చరిక - చక్కదిద్దుకోడానికి ఇస్తున్న అవకాశం.

పనిచేయని ప్రభుత్వాలని ప్రజలు సాగనంపడం నేర్చుకున్నారు. అలాగే పనిచేసే ప్రభుత్వాలని తిరిగి కొనసాగించడానికీ తీర్పునిస్తున్నారు. ఇక తేల్చుకోవలసింది యూపీయే ప్రభుత్వం మాత్రమే. మధ్యంతర దిద్దుబాటుకు సిద్ధంకావడం లేదా జడత్వంలో కూరుకుపోయి ప్రజల ఆగ్రహానికి గురికావడం. ■


# లోక్‌సత్తా టైమ్స్

## 2011, జూన్ 16-30

## విద్యారంగం పై ప్రత్యేక సంచిక

గతంలో ప్రకటించినట్లు కాకుండా 2011, జూన్ 16-30 లోక్‌సత్తా టైమ్స్‌ను విద్యారంగంపై ప్రత్యేక సంచికగా రూపొందిస్తున్నాము. విద్యారంగంపై ఒక సమగ్రమైన అవగాహన కల్పించేందుకు సమగ్రమైన సమాచారంతో ఈ సంచిక వెలువడుతుంది. ఈ ప్రత్యేక సంచికకు జూన్ 14 తేదీలోగా రాష్ట్రంలోని విద్యా సంస్థలు ప్రకటనలు ఇచ్చి సహకరించాల్సిందిగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

# భారతదేశం

## తెలుసుకోదగిన కొన్ని విశేషాలు

1. 71% లేదా 770 మిలియన్ ప్రజలు వయసులో 35 లోపువారే. భారతీయులు చిన్నవారే.
2. ప్రతి సంవత్సరం 29 మిలియన్ పిల్లలు పుడతారు, 10 మిలియన్ ప్రజలు మరణిస్తారు. జనాభా పెరుగుదల 1.8%.
3. శిశు పాఠశాల మరియు 10+2 మధ్య చదువు మానేసే పిల్లల సూచి 90% నుండి 94%.
4. భారతదేశంలో 97 లక్షల స్కూళ్ళు ఉండగా చైనాలో 180 లక్షలున్నాయి.
5. 10+2 (ఇంటర్) దశ దాటి పై చదువులు చదువుతున్న వారి శాతం 6%.
6. 15,600 కాలేజీలో చదువుకుని పట్టభద్రులయ్యేవారిలో 72% ఆర్ట్స్ పట్టభద్రులు. మిగిలిన 28% సైన్స్, కామర్స్, ఇంజనీరింగ్, ఐ.టి., మెడికల్, లా, మేనేజ్‌మెంట్ మరియు ప్రత్యేక పాఠ్యాంశాల వారు.
7. భారతదేశంలో 372 విశ్వవిద్యాలయాలు ఉండగా చైనాలో 900 మరియు జపాన్‌లో 4000 ఉన్నాయి.
8. ఎంచుకునేందుకు 2500 వృత్తి విద్య మరియు శిక్షణ (విఇటి) కార్యక్రమాలుండగా ప్రపంచంలో 15 నుండి 35 ఏళ్ళ మధ్య యువకులలో 95% ఏదో ఒక వృత్తి, ఒక నైపుణ్యం లేదా ఒక వాణిజ్యం నేర్చుకుంటూ ఉన్నారు. కాని భారతదేశంలో గుర్తించినవి సుమారుగా 71 వాణిజ్య కార్యకలాపాలలో మన జనాభాలో కనీసం 2% కూడా క్రమబద్ధమైన విఇటి తర్ఫీదు కోసం వెళ్ళడం లేదు.
9. భారతదేశంలో 11,000 ఐ.టి.ఐ.లు మరియు వి.ఇ.టి. స్కూళ్లు ఉండగా చైనాలో 5,00,000 ఉన్నత మాధ్యమిక వృత్తి విద్యా మరియు శిక్షణ పాఠశాలలు ఉన్నాయి.
10. భారతదేశంలో మనకి ఇంజనీర్లు దొరుకుతారు కానీ అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపడే కార్పెంటర్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, రిపేర్ చేసేవారు మరియు ఇతర వృత్తి నిపుణులు దొరకరు.
11. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ. సాఫ్ట్‌వేర్ లేదా ఐ.టి. రంగాలు మాత్రమే అందుకు భిన్నం. బహుశా 50,000 లేదా అంతకన్నా ఎక్కువగా ప్రైవేట్ ఐ.టి. తర్ఫీదు కేంద్రాలు ఉండడమే అందుకు కారణం కావచ్చు.



12. ఐ.టి. మరియు సాఫ్ట్‌వేర్ ప్రపంచం యొక్క జిడిపిలో 1.5% మాత్రమే. ప్రస్తుతం భారతదేశం యొక్క వాటా సుమారుగా 5% త్వరితమైన ఆర్థిక పెరుగుదలకు, ఉద్యోగాలను ఉత్పత్తి చేసేందుకు, మనం మిగిలిన 95% ఆర్థిక మరియు వాణిజ్య వ్యవస్థలపై కేంద్రీకరించాల్సిన అవసరం మరియు వాటిని ప్రపంచస్థాయికి చేర్చాల్సిన అవసరం ఉంది.
13. దేశంలో సుమారు 300 మిలియన్ల నిరుద్యోగులు ఉండగా 45 బిలియన్ మాత్రమే వాస్తవంగా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులలో రిజిస్టర్ చేసుకుంటున్నారు.

14. కొత్తగా ఉత్పత్తి అయ్యే ఉద్యోగాలలో 1% ప్రభుత్వోద్యోగాలు, 2% 'సంఘటితరంగం' లోనివి కాగా మిగిలిన 97% 'అసంఘటిత రంగం' లోనివే.

15. మనకు గల 430 మిలియన్ల పని చేసేవారిలో 94% 'అసంఘటితం రంగం' లో పనిచేస్తూ ఉండగా, 6% 'సంఘటిత రంగం'లో పనిచేస్తున్నారు.

16. మన జనాభా మొత్తంలో 1.7% అంటే 18 మిలియన్ ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో పనిచేస్తున్నారు, మరో 9 మిలియన్ ప్రజలు ప్రైవేట్ 'సంఘటిత రంగం'లో పనిచేస్తున్నారు–ఈ మొత్తం శాతం జనాభాలో 2.6% మాత్రమే.

17. కార్మిక చట్టాలన్నీ భారతీయ జనాభాలోని పై 2.6%కి, రక్షణ కల్పించాలని తయారు చేయబడ్డాయి. ప్రభుత్వోద్యోగులకు కావాల్సినదానికన్న ఎక్కువ రక్షణను భారతీయ రాజ్యాంగం యొక్క ఆర్టికల్ 311 ద్వారా పొందుతున్నారు.

18. 3R' ల (చదవడం,రాయడం, లెఖ్ఖల చదువు ప్రాథమికస్థాయి లేదా 5వ తరగతి వరకు) యొక్క అంతర్జాతీయ నిర్వచనం ఆధారంగా 600 మిలియన్లు నిరక్షరాస్యులైన ప్రజలు. (మా అంచనాలు) భారత ప్రభుత్వం ప్రకారం 63% అక్షరాస్యులు. చైనాలో 93% అక్షరాస్యులు.

19. అక్షరాస్యత యొక్క భారతీయ నిర్వచనం ప్రజల సర్వేపై ఆధారపడింది. "మీకు మీ పేరు రాయడం వస్తే చాలు మీరు అక్షరాస్యులన్నమాటే'. ఈ నిర్వచనాన్ని ఎవరూ, ఎప్పుడూ తీవ్రంగా సవాలు చేయలేదు.

20. రోజుకు రూ. 11 (గ్రామీణ ప్రాంతం) నుండి రూ.14 (పట్టణప్రాంతం) అన్న భారతీయ ప్రభుత్వపు దారిద్ర్యరేఖ నిర్వచనానికి దిగువ 300 మిలియన్లు బతుకుతున్నారు. (రోజుకు 2200కే కేలరీల ఆహార విలువ గల సరిపోయేటంత బియ్యం మరియు గోధమలను ప్రజాపంపిణీ పద్ధతి ద్వారా / రేషన్ షాపుల ద్వారా కొనుక్కోగలుగుతున్నారన్న విషయం ఆధారంగా).

21. ప్రపంచ జిడిపిలో భారతదేశానికిది 1.72% మాత్రమే మరియు ప్రపంచ జనాభాలో 17% మనది. అవసరాలు ఎక్కువ. కానీ కొనుగోలు శక్తి తక్కువ. అంచేత మనం ఎగుమతికి సంబంధించిన కార్యకలాపాలను 10 రెట్లు పెంచాల్సిన అసరం ఉంది. భారతీయ మార్కెట్ కన్న విదేశీ మార్కెట్లు 60 రెట్లు పెద్దవి గనక. ప్రపంచ మార్కెట్లలో లేదా విదేశ వాణిజ్యంలో మన వాటా 1000 ఏళ్ళ క్రితం గల 33% కన్న తక్కువై, బ్రిటిష్ వారు మన దేశంలో కాలుమోపిన నాడుగల 27% కన్న తక్కువై 1947లో ఉన్న 3% కన్న తక్కువై ప్రస్తుతం 0.8% అయింది.

22. భారతీయులలో 5% మాత్రమే ఇంగ్లీషు అర్థం చేసుకోగలరు. అయినా, భారతప్రభుత్వం యొక్క రాష్ట్ర ప్రభుత్వాల యొక్క మరియు ప్రభుత్వ సంస్థల యొక్క వెబ్‌సైట్స్ చాలామటుకు ఇంగ్లీషులోనే ఉంటాయి.

23. శిశు మరణాలు, పిల్లల సంరక్షణ, పోషకాహారలోపం, స్త్రీల ఆరోగ్యం, శుద్ధమైన నీరు జబ్బులు, వ్యాధులు, ఆరోగ్యం మొదలైన వాటికి సంబంధించిన మానవ వికాస సూచిక విషయంలో మటుకు భారతదేశం బహుశ అట్టడుగున ఉంది.

24. ఇతర దేశాలవలెగాక, మనకు 18 అధికార భాషలున్నాయి, 4000 మాండలీకాలు ఉన్నాయి, ప్రపంచం లోని మతాలన్నీ ఉన్నాయి. మరింక మానవ, ఆర్థిక వికాసాల స్థాయి తక్కువగా ఉన్నందువలన, ఎస్‌సి, ఎస్‌టి, దళితులు, కులం, మతం, తెగ, మైనారిటీలు, ప్రాంతీయాలు జాతుల గుంపులు మొదలైన వాటి ఒత్తిడి ఎక్కువ.

25. www.loksatta.org ప్రకారం, భారతదేశాన్ని పాలించేందుకుగాను, కేంద్ర మరియు రాష్ట్రస్థాయిలో, రెవెన్యూ మరియు క్యాపిటల్ ఖాతాపై సుమారుగా రూ.2200 కోట్లు ప్రతిరోజు ఖర్చు చేయబడుతోంది. పాలన మెరుగుపడాలంటే మనం +95%కి పైగా అక్షరాస్యత, చురుకైన పౌరసంఘాల అధిక సంఖ్య మరియు సమాచార హక్కు చట్టం యొక్క మరింత వినియోగం ఉండేలా నిర్ధారించుకోవలసిన అవసరం ఉంది.

26. ప్రజలకు, ప్రజల కోసం, ప్రజలచేతనే మరి ప్రజాస్వామ్యం, మనమింక విజయం సాధించాలంటే, పరిపాలనలో పౌరులు నిమగ్నమవాలి. పాల్గొనాలి.

**మరిన్ని వివరాల కోసం దయచేసి ఈ వెబ్‌సైట్‌ని**

www. wakeupcall.org **వద్ద చూడండి.** ■

# అంతర్జాతీయ రంగంలో నూతన వేదిక 'బ్రిక్స్'

డి. సోమసుందర్

***(B**razil + **R**ussia+ **I**ndia + **C**hina + **S**outh Africa = **BRICS)***

అధికారానికి సంబంధించిన నూతన రీతులనూ, స్వరూపాలను ఈ 21వ శతాబ్దంలో మనం చూస్తున్నాం. అధికారానికి గల నైసర్గిక్ స్వరూపం సమూలంగా మారిపోతోంది. అంతర్జాతీయ వ్యవస్థలో ప్రకంపనలు పుట్టించే మార్పులు చోటు చేసుకుంటున్నాయి. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాలతో ఏర్పడిన 'బ్రిక్స్' వేదిక ప్రపంచశక్తులుగా ఆవిర్భవిస్తున్న దేశాల సమావేశ వేదిక మాత్రమే కాదు. ఇప్పుడు అదొక నూతన అధికార వ్యవస్థగా రూపొందుతోంది.

జాన్‌హిప్కిన్స్ విశ్వవిద్యాలయానికి చెందిన మిఖాయెల్ మండెల్‌బామ్ చెప్పిన అంశాన్ని గమనించాలి. ప్రపంచంలో భారత్ ప్రభావం పెరగడానికి దాని ప్రజాస్వామ్యం లేదా ప్రజాస్వామ్య ఆదర్శవాదం కారణమైతే, సైనిక శక్తికారణంగా రష్యా, ఆర్థికశక్తి కారణంగా చైనా తమ ప్రభావాన్ని పెంచుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. బ్రెజిల్ ఎంతో భవిష్యత్తుకలిగిన దేశం. దక్షిణాఫ్రికా గట్టి ఆకాంక్షలతో వున్నదేశం, వీటన్నిటికలయికతో 'బ్రిక్స్' ఏర్పడింది. సమాంతర అంతర్జాతీయ వ్యవస్థలనూ, యంత్రాంగాలను ఏర్పాటు చేసే ప్రక్రియను 'బ్రిక్స్' ప్రారంభించింది. ప్రపంచ కేంద్రం తూర్పుదిశగా కదులుతున్న ప్రస్తుత తరుణంలో ఇక మిగిలిన దేశాలకు తమతో అవసరం ఏముంటుందంటూ పశ్చిమ దేశాల భౌగోళిక రాజకీయ మేధావులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గత కొద్ది సంవత్సరాలుగా ప్రపంచం గుర్తించలేనన్ని మార్పులకు లోనయ్యింది. అమెరికా నిరంతర క్షీణతలో వుండటం తో ప్రపంచం దృష్టి చైనా, భారత్, దేశాలపైకి మళ్ళింది. బ్రెజిల్‌కు సైతం చెప్పుకోవడానికి ఓ గొప్పగాథ వుంది. భారత్ ప్రముఖ పాత్ర పోషిస్తూ వచ్చిన నామ్, సార్క్ వంటివి అసంఘతాలుగా వున్నాయి.

చైనా, రష్యా, కలిసివున్న వేదికపై భారత్ వుండటం పట్ల ప్రపంచ రాజకీయ, వ్యూహ నిపుణులు భరోసా వ్యక్తం చేసారు. భారత్ ఒక కండబలం కలిగిన శక్తిగా మాత్రమే కాక, ఆ వేదికకు సమతుల్యతను తీసుకురాగల, విశ్వసించదగిన శక్తిగా వారు పరిగణిస్తున్నారు. ఆధునికమైన, చట్టబద్ధమైన సామాజిక, రాజకీయ వ్యవస్థకు అవసరమైన ప్రాంతీయ ప్రపంచ స్థాయి ప్రమాణాలను భారతీయ సమాజమూ, భారత రాజకీయాలు సంతరించుకున్నాయని వారు నమ్ముతున్నారు. భారత్‌కు భిన్నంగా చైనాలో పారదర్శకత పట్లా, బహుళత్వవాదం పట్లా తీవ్రమైన అసహనం వుంది. అలాగే రష్యాలో 'అనూహ్యత' పాలు ఎక్కువగా వుంది. దేశాల వైశాల్యమూ, కండబలం ఆధారంగా ఏర్పడే ఆధిపత్యవ్యవస్థ బదులు, చిన్నా, పెద్ద వ్యత్యాసాలు లేని, సార్వభౌమదేశాల మధ్య సమానత్వం ఆధారంగా బహుళపక్ష వ్యవస్థలు ఏర్పాటు కావాల్సివుంది. ఇటువంటి ఏర్పాటు పట్ల భారత్‌కు గల నిబద్ధతపై అంతర్జాతీయ సమాజానికి నమ్మకంవుంది.

రోజురోజుకూ బ్రిక్ దేశాల సామర్థ్యమూ, శక్తి పెరుగుతూ వచ్చాయి. ఆర్థిక కార్యకలాపాల ప్రపంచకేంద్రం బడా పారిశ్రామిక దేశాల నుంచి క్రమేపీ ఆసియా,












ఆఫ్రికా, లాటిన్ అమెరికా,లో ఆవిర్భవిస్తున్న నూతన ఆర్థిక శక్తుల దిశగా కదులుతున్నది. ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో ఇండోనేషియాతో కలిపిన బ్రిక్ వాటా 2000 సంవత్సరం నాటికి 18 శాతం ఉండగా, బడా పారిశ్రామిక దేశాల వాటా 65 శాతం వుంది. 2010 సంవత్సరం నాటికి దీని తీరు పూర్తి వ్యతిరేక దిశకు మారిపోయింది. బ్రిక్ దేశాల వాటా 25శాతానికి పెరగ్గా, పారిశ్రామిక దేశాల వాటా 56 శాతానికి కుదించుకు పోయింది. అదే దశాబ్దంలో బ్రిక్ దేశాల జీడీపీ 92.5 శాతం పెరగ్గా, ప్రపంచ జీడీపీ 32 శాతం పెరిగింది. అదే సమయంలో పారిశ్రామిక దేశాల జీడీపీ 15.5 శాతం పెరుగుదల మాత్రమే నమోదు చేసింది.

ప్రస్తుతం ఈ బృందంలోకి దక్షిణాఫ్రికా కూడా చేరడంతో బ్రిక్స్ మరింతగా బలపడుతుందని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఆసియా, లాటిన్ అమెరికా, యూరోపు ప్రాంతాల్లో ఇప్పుడు ఎదుగుతున్న ఆర్థిక శక్తులతో ఏర్పడిన బ్రిక్స్ వంటి కీలక సంస్థలో దక్షిణాఫ్రికాను చేర్చుకోవడం అర్థవంతమైన పని. ఈ పరిణామానికి ఎంతో భౌగోళిక రాజకీయ ప్రాముఖ్యం వుంది. బ్రిక్ దేశాల ఆర్థిక, రాజకీయ పలుకు బడి పెరుగుతుండటం పట్ల అమెరికా చాలా సంవత్సరాలుగా కలవర పడుతోంది. భద్రతా మండలిలో బ్రెజిల్, దక్షిణాఫ్రికాలతో పాటు తనకు కూడా సముచిన స్థానం దక్కాలని భారత్ కోరుకుంటోంది. బ్రిక్స్‌లో దక్షిణాఫ్రికాను చేర్చుకోవడం చతురతతో కూడిన రాజకీయ నిర్ణయమని, దీని వల్ల బ్రిక్స్ అధికారమూ, స్థాయి పెరుగుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆఫ్రికాకు గల అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ బ్రిక్స్‌లో చేరింది. అయితే అదే సమయంలో ప్రపంచ జీడీపీ ఆర్థిక వ్యవస్థల జాబితాలో 31వ స్థానంలో ఆఫ్రికా వుందని గుర్తుంచుకోవాలి. బ్రిక్స్‌లోని మిగిలిన దేశాలతో పోలిస్తే ఆఫ్రికా చాలా వెనుక బడివుంది. చైనా కంటే ఇరవైరెట్లు వెనుకబడివుంది. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న టర్కీ, మెక్సికో, దక్షిణ కొరియా దేశాల కంటే కూడా ఆఫ్రికా వెనుకే వుంది.

ప్రస్తుతం దక్షిణాఫ్రికా చైనాతో అతిపెద్దవ్యాపార భాగస్వామిగా వుంది. భారత్‌సైతం దక్షిణాఫ్రికాతో వ్యాపార సంబంధాలను పెంచుకోవాలని చూస్తోంది. బ్రిక్స్‌లో వుండటం ద్వారా దక్షిణాఫ్రికా బ్రిక్స్‌లోని ఇతర దేశాల కంటే ఎక్కువ లాభం పొందుతుందన్న భావన వున్నది. ఇటీవల చైనాలోని హైనన్ రాష్ట్రం సాన్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సభ్యదేశాల ఆర్థిక వ్యవస్థల పెరుగుతున్న ప్రాముఖ్యాన్ని మరోసారి చాటి చెప్పింది. 'ఉమ్మడి అభివృద్ధి – సంపదలో భాగస్వామ్యం' అనే బ్రిక్స్ దృక్పథాన్ని సదాశయ ప్రకటనగానే భావించవచ్చు. కానీ ప్రపంచ ఆర్థిక పరిపాలన కోసం వారుతీసుకుంటున్న చొరవలు మాత్రమే తీవ్రపరిశీలనకు అర్హమైనవి.

భారత్, చైనా, కొంత మేరకు రష్యా, చైనా పరస్పరం పోటీ పడుతూనే సహకరించుకుంటున్నాయి. అవి మరింత ప్రాబల్యం కోసం ప్రయత్నిస్తున్నాయి. నూతన అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక వ్యవస్థను రూపొందించాలంటే తాము చేతులు కపపడం మినహా మార్గాంతరం లేదని ఆయా దేశాలు గుర్తించాయి. మరింత న్యాయ బద్ధమైన సమానత్వం కలిగిన అంతర్జాతీయ రాజకీయ – ఆర్థిక పరిపాలనా వ్యవస్థ కోసం ఒక విశాలమైన నమూనా ప్రణాళికను ఆదేశాలు రూపొందించాయి. ఇదొక దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహం.

సాన్యాలో జరిగిన శిఖరాగ్రసదస్సు రూపొందించిన వ్యూహం ఉత్తరదక్షిణ ప్రాంతాల మధ్య అగాధాన్ని పూడ్చేందుకు వుద్దేశితమయ్యింది. సంఘర్షణారహితమైన ఈ ఉమ్మడి దృక్పథం ద్వారా బ్రిక్స్ దేశాలు అంతర్జాతీయ సమాజంలో విశ్వాసాన్ని రేకెత్తించింది. ఆహారభద్రత, వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత వంటి ప్రపంచ సమస్యల పరిష్కారం మిగిలిన ప్రపంచంతో సహకార ధోరణితో ఉండటం ద్వారానే సాధ్యమవుతుంది. తాము పాటించడం ద్వారా మాత్రమే ఇతర దేశాలకు బ్రిక్స్‌దేశాలు మార్గదర్శకంగా వుండగులుగుతాయి. భారత్-చైనా దేశాలు కలిసి ఏ విధంగా పని చేస్తాయో, చైనా-రష్యా దేశాలు తమ సమాజాల్లోని ప్రజాస్వామ్య కొరతలను ఏ విధంగా అధిగమించగలుగుతాయో వాటిముందున్న నిజమైన సవాళ్ళు. అప్పుడు మాత్రమే ప్రపంచ ఆర్థిక సహకారం విషయంలో బ్రిక్స్ దేశాలు ఒక నూతన నమూనాగా నిలుస్తాయి. వాటికి నూతన అంతర్జాతీయ ఆర్థిక సహకారం విషయంలో ఒక విశాల దృక్పథం వుందనడంలో అనుమానం ఏమీ లేదు. భారత్‌గానీ, బ్రెజిల్ గానీ భద్రతా సమితిలో చోటు సంపాదిస్తే అప్పుడని ఇంకా కలిసే వుంటాయా అనేది మరో సందేహం.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొన్ని మార్పులు చెయ్యాలని బ్రిక్స్ శిఖరాగ్రసదస్సు డిమాండ్ చేసింది. నగదు స్వీకర్తల ప్రత్యే హక్కులను విస్తరించాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకు విజ్ఞప్తిచేసింది. సభ్యప్రభుత్వాల మధ్య నిధుల బదిలీకి ఈ హక్కులు చెలామణి ద్రవ్యం మాదిరిగా వినియోగపడతాయి. అంతర్జాతీయ ఆర్థిక పరిపాలనకు సంబంధించిన అంశాల పట్ల శిఖరాగ్ర సదస్సు వ్యవహార సరళితో వ్యవహరించింది. స్థిరత్వం- నిశ్చితత్వం తీసుకురావడానికి గాను విస్తృత ప్రాతిపదిక గల అంతర్జాతీయ రిజర్వు కరెన్సీ వ్యవస్థలు ఏర్పాటు చెయ్యాలని బ్రిక్స్ పిలుపు ఇచ్చింది. డాలరు పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఈ ప్రతిపాదన వినియోగపడుతుంది. ఈ అయిదు దేశాల అభివృద్ధి బ్యాంకులు ఇప్పటికే స్థానిక కరెన్సీలోనే పరస్పర రుణాలు ఆదాన ప్రదానాలు జరిపేందుకు సూత్రప్రాయంగా ఆమోదించాయి. ద్వైపాక్షిక ఆర్థిక లావాదేవీలలో తమ జాతీయ కరెన్సీల వినియోగాన్ని విస్తరించాలని బ్రిక్స్ దేశాల నేతలు గట్టిపిలుపునివ్వడం గమనించాలి. రష్యాలో శిఖరాగ్రసదస్సు జరిగిన సమయంలో కూడా ఇటువంటి పిలుపే వినపడింది.

బ్రిక్‌ను విస్తరించడం వల్ల వచ్చే వ్యూహాత్మక ఆకర్షణ విషయం ప్రక్కన బెట్టి చూస్తే విస్తరణ వల్ల తన ప్రకటిత




అజెండా నుంచి పక్కకు మళ్ళుతుందనీ, దాన్ని కలిపివుండే బంధన శక్తి తగ్గిపోతుందనీ సందేహాలు వ్యక్తమయ్యాయి. వివాదస్పద అంశాలు భారంవల్ల బ్రిక్స్ అజెండా సంక్లిష్టంగా మారిపోయే ప్రమాదం వుంది. అయినప్పటికీ ప్రస్తుతం బ్రిక్ విస్తరించి బ్రిక్స్‌గా మారింది. దీన్ని భవిష్యత్తులో మరింతగా విస్తరించాల్సిరావచ్చు. ఈ బృందంలో ఇండోనేషియా చేరినట్లయితే భారత్ ఎంతగానో సంతోషిస్తుందన్న సంకేతాలు కన్పిస్తున్నాయి.

బ్రిక్స్ పదబంధం నుంచి సి అక్షరాన్ని తొలగించాల్సిన సమయం ఆసన్నమయ్యిందని కొంతమంది అంటున్నారు. చైనా ఎంతమాత్రమూ ఆవిర్భవిస్తున్న ఆర్థిక వ్యవస్థకానేకాదు. అది ఇప్పటికే ఆవిర్భవించేసింది. అమెరికా, ఒకప్పటి సోవియట్ యూనియన్ మాదిరి చైనా అగ్రరాజ్యం కాకపోవచ్చు. కానీ చైనా ఒక గొప్ప శక్తిగా మారింది. ప్రపంచదేశాల పరస్పర సంబంధాల విషయంలో యూరోపు, జపాన్, కంటే చైనా చాలా కీలకమైనదయ్యింది. చైనా సహకారం లేకపోతే అంతర్జాతీయ అంశాలపై నిర్ణయం తీసుకోవడంగానీ, ఏకాభిప్రాయాన్ని నిర్మించడంగానీ సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. అంతర్జాతీయ రాజకీయ రంగంలో, ఆర్థిక ప్రాబల్యంలో బ్రెజిల్, రష్యా, భారత్ దేశాలు చైనా కంటే వెనుకబడి తాము కూడా వున్నామనిపించుకునే స్థాయిలో మిగిలిపోయాయి.

చైనా వ్యూహాత్మక విస్తరణ కారణంగా ఏదోఒక దశలో భారత్ అసౌకర్యంగా భావించాల్సి వస్తుంది. "రష్యాపతనం చైనా ఎదుగుదలకు దోహదం చేసిందనీ, ఇది భారతదేశపు దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రతికూలమైనదని" మన విదేశాంగ శాఖ పూర్వ కార్యదర్శి కన్వర్‌సిబల్ పేర్కొన్నారు. రష్యాపునరుజ్జీవనం పొందాలని భారత్ గట్టిగా ఆశిస్తోంది. ప్రపంచ వ్యవహారాలలో మరింత సమతుల్యతను తీసుకొచ్చేందుకు రష్యా పునరుజ్జీవనం దోహదం చేస్తుందని భారత్ భావిస్తోంది. ■



వకుళాభరణం రామకృష్ణ

# సురవరం ప్రతాపరెడ్డి

## తెలుగు జాతి సాంఘిక చరిత్రకారుడు

జాతీయవాద సిద్ధాంత స్ఫూర్తితో చరిత్ర రచన పరిణతి చెందుతున్న దశలో, చరిత్రకారుల దృష్టి రాజుల, రాజవంశాల వర్ణనల నుంచి క్రమేపీ సాంఘిక, సాంస్కృతికాంశాలపై మరలడం ఆరంభమైంది. 1950 దశకం నాటికి యీ వైఖరి బలపడి సాంఘిక చరిత్రలు మొదలయ్యాయి. కొమర్రాజు లక్ష్మణరావు స్థాపించిన విజ్ఞానచంద్రికా గ్రంథమండలి, చిలుకూరి వీరభద్రరావుచే రాయించిన ఆంధ్రుల చరిత్ర, రాజకీయ చరిత్రతో కొంతవరకు సామాజికాంశాలు చోటుచేసుకున్నా, వాటికి ప్రాముఖ్యం లభించని రోజుల్లో యీ గ్రంథం రాయాలని పించడమే ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

సురవరం ప్రతాపరెడ్డికి, తెలంగాణ రాజకీయ, సాహిత్య సాంస్కృతిక పునరుజ్జీవనానికి విడదీయరాని లంకె వుంది. శ్రీకృష్ణ దేవరాయ భాషాంధ్రనిలయం స్థాపన (1901) యీ పునరుజ్జీవనానికి నాంది అని భావించినా, ఆ తర్వాతి కాలంలో తెలంగాణను తట్టి మేల్కొల్పిన గ్రంథాలయోద్యమానికి సురవరం వారు ఆయువు పట్టుకాగా, 1921లో స్థాపించిన ఆంధ్ర జనసంఘ కార్యకలాపాల్లో సురవరం పాత్ర గణనీయం. తెలంగాణ మేల్కొంది. కనీసం చిన్న సారస్వత సభ పెట్టుకోడానికి కూడా నైజాం ప్రభుత్వం అనుమతి పొందాలని నియమం వున్న రోజులు. అయిదు శాతానికి మించని అక్షరాస్యత. వెట్టిచాకిరి బానిస విధానంలో మగ్గుతున్న సామాన్య ప్రజానీకం. తెలుగు భాష అత్యంత నిరాదరణకు గురైన గడ్డుకాలం. ఇంతటి సాంస్కృతిక వెనుకబాటుతనానికి గురయిన తెలంగాణ ప్రాంతంలో తెలుగు వెలుగులు ప్రసరింపబూనుకొన్ని వైతాళికుల సరసన చేరి, అగ్రగణ్యతను సాధించి, జన జీవితంలో సమూల మార్పు రావడానికి కృషి చేసిన ఆంధ్ర మహాసభ మొదట సమావేశానికి జోగిపేటలో అధ్యక్షత వహించి, మాడపాటి వారి ప్రశంసలందుకొన్నారు, సురవరం ప్రతాపరెడ్డి.



సురవరం ప్రతాపరెడ్డి

సాహిత్యం, భాష, పత్రికా రంగాల్లో సురవరం గావించిన కృషి ప్రశంసనీయం. దాదాపు 40 గ్రంథాలకు (ముద్రిత, అముద్రితాలు) పైగా రచించారు. వీటిలో పలువురు ప్రశంసలు అందుకొన్న వాటిలో చెప్పుకోదగ్గవి, రామాయణ విశేషాలు, హిందువుల పండుగలు (యీ గ్రంథానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ పీఠిక రాశారు). వీటి గురించి, యింకా వారి ఇతర రచనల గూర్చి వేమిక్కడ వివరించబూను కోవడం లేదు, కానీ, ఒక, రెండు విషయాలు యీ సందర్భంలో ప్రస్తావించుకోవాలి.

‘గోలకొండ కవుల సంచిక’ను వెలవరించి, తెలంగాణలో కవులే లేరన్న నిరాధార, అభ్యంతరకర వ్యాఖ్యలకు దీటైన సమాధానమిచ్చారు. ‘నిజాం రాష్ట్ర పాలనము’ హైదరాబాద్ రాజ్య వ్యవస్థ గూర్చి పలు అంశాలను వివరించి, ప్రజా చైతన్యానికి దోహదపడింది. ప్రముఖ చరిత్రకారులు మల్లంపల్లి సోమశేఖర శర్మ యీ గ్రంథాన్ని సురవరం వారి ‘ఆంధ్రుల సాంఘిక చరిత్ర’తో పోల్చి ‘ఆ రెంటిలో యేది గొప్పదో, ఏది తక్కువదో

తరతమ భేదాలు నిర్ణయించడం చాల కష్టం' అన్నారు. సంస్కృతం, పారశీక, ఉర్దూ, మధ్యయుగాల భావజాల నేపథ్యం నుంచి వచ్చినా, వ్యక్తి స్వేచ్ఛ, సమానత్వ భావాలను పుణికిపుచ్చుకొని నిజాం నిరంకుశాధికారాన్ని ప్రశ్నించాడు.

'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' రాయపూనుకున్నప్పుడు సురవరం ఎదుర్కొన్న రెండు ముఖ్య సమస్యలు, ఒకటి, సాంఘిక చరిత్ర అంటే ఏమిటన్నది? అంతవరకూ రాజకీయ, పరిపాలనాంశాలకే చరిత్ర పరిశోధనలు దాదాపుగా పరిమితమయ్యాయి. సాంఘిక చరిత్ర గురించి సురవరం యిలా నిర్వచించుకొన్నారు వారి గ్రంథంలో, "సాంఘిక చరిత్ర మానవచరిత్ర – ప్రజల చరిత్ర, అది మన సొంత కథ... అది మన తాతముత్తాతల చరిత్రి! వారి యిండ్లు, వారి కట్టు, వారి తిండి, వారి ఆటలు, వారి పాటలు, వారు పడిన పాట్లు, వారు మనకిచ్చిపోయిన మంచి చెడ్డలు...". ఇక సురవరం ఎదుర్కొన్న రెండవ సమస్య. మొదటిదాని కంటే కీలకమైనది సాంఘిక చరిత్ర రాయడానికి అవసరమైన ఆధారాలు. సురవరం ఎంపిక చేసుకొన్నవి ప్రధానంగా సాహిత్య ఆధారాలు, కొంతవరకు శాసనాలు, యాత్రాచరిత్రలు, చాటువులు, సామెతలు, నిఘంటువులు, అప్పటికి లభ్యమవుతున్న ఆంగ్ల గ్రంథాలు – విన్సెంట్ స్మిత్, ఆర్.సి.దత్ బిల్గ్రామి తదితరులు రాసినవి. తెలుగు ప్రబంధాలన్నీ తన రచనకు ఉపయోగపడవన్నారు. కైఫీయత్తులు, నాణేలు, విదేశీ యాత్రికుల రచనలు, శిల్పాలు, చిత్రలేఖనం, సుద్దులు, జంగమ కథలు, జానపదుల పాటలు – వీటన్నిటిని వాడుకోవడంలో సురవరం చూపిన సమగ్రదృష్టి శ్లాఘనీయం. ఆధారాలు లభ్యం కాలేదంటూ సురవరం తన 'తొలిమాట'లో యిలా రాసుకున్నారు. "నేను అలంపూరు తాలూకాలోకి "నీళ్ళులేని యిటికెలపాడు" అను కుగ్రామమందుండి యీ గ్రంథము వ్రాసినందున నా వద్ద నుండి గ్రంథసామగ్రి తప్ప వేరే ఆధారము లేకపోయెను. సమీపమున నుండు కర్నూలులో ఎంత వెదికినను కావలసిన కొన్ని గ్రంథాలు లభించలేదు. అందుచేత నాకు యీ గ్రంథము తృప్తినొసగలేదు."




గ్రంథ పరిధి తూర్పు చాళుక్యులతో ప్రారంభమై కాకతీయులు, రెడ్డిరాజులు, నాయకరాజులు, విజయనగర, బహ్మనీ, కుతుబ్‌షాహీ రాజ్యాలను దాటి ఆధునిక యుగంలో 1907 దాకా కొనసాగింది. జనజీవనంలోని సూక్ష్మాంశాలన్నింటిని, ఆ కాలంలో ప్రజలు ఏం తిన్నారు, తాగారు, ఏం కట్టుకున్నారు, ఏ పాటలు పాడి, యే ఆటలు ఆడారు. ఇవి జన జీవితంతోని రోజువారీ వ్యవహారాలు. ఇవిమాత్రమే సాంఘిక చారిత్రకాంశాలు కావు కదా! ఒక జీవనంతో ముడిపడిన వ్యవసాయం (ఏం తింటారన్న దానికి మూలం), వ్యాపారాలు, చదువులు, యుద్ధ తంత్రం, సైనికవ్యవస్థ, చేతి పనులు, గ్రామసభలు, మతం, మతంతో ముడిపడిన కర్మకాండలు వీటిలో చోటుచేసుకున్నాయి. 1949లో ప్రధాన ముద్రణ కాగానే, రెండవ ముద్రణ 1950లోనే రావడం, (ఇటీవల మరోముద్రణ వెలవడింది.) కేంద్ర సాహిత్య ఆకాడమీ ఆవార్డు (తెలుగు సాహిత్యంలో యిది మొదటిదా?) పొందింది. 'ఆంధ్రా కాసామాజిక ఇతిహాస్' హిందీలోకి అనువదింపబడింది కూడా.

ఈ గ్రంథ రచనతో సంతృప్తి పొందలేదని సురవరం చెప్పడం వారి వినయశీలతను తెలియజేసినా, యీ రచన సమగ్రమా? సమగ్రం అని మనం దేన్నీ అనలేం. ఏదైనా సాపేక్షమేనన్న సత్యాన్ని ఆటుంచి, అప్పటి పరిస్థితుల్లో యిది సమగ్రం కావడానికి అనువైన మేధోపర చారిత్రక వాతావరణం లేదు. అంతేగానీ, గ్రంథకర్త లోపం కాదు. అప్పటి చరిత్ర రచనా పద్ధతిలోని పరిమితులు, సైద్ధాంతిక అంశాలు దీనికి కారణాలు. సవిమర్శక చారిత్రక గ్రంథాలు, ఆంధ్రుల చరిత్రపై సమగ్ర విశ్లేషణలూ రావాల్సి వుంది

(యిప్పటికీ). పైగా, చరిత్ర రచన జాతీయోద్యమ భావజాల ప్రభావం నుంచి పూర్తిగా బయటపడి, ఆర్థిక సామాజిక, సాంస్కృతిక అంశాలపై దృష్టి పెట్టలేదు. జాతీయోద్యమ భావజాలమే కాదు, వలసవాదుల చరిత్ర రచనా దృక్పథమూ పూర్తిగా తొలగలేదు. ఈ ప్రభావాలు సురవరం వారి గ్రంథంలో, ప్రత్యేకించి ఆధునిక యుగంపై రాసిన అధ్యాయాల్లో కన్పిస్తాయి. ఏ సమాజంలోనైనా, స్థలకాలాదులను దృష్టిలో ఉంచుకొని, అప్పటి సామాజిక పరిస్థితుల, ప్రధానంగా ఆర్థిక వ్యవస్థ, సాంకేతికాభివృద్ధి అంశాలపై ఆధారపడివుంటాయి. ఒక ఉదాహరణ. కాకతీయుల, విజయనగర రాజుల కాలంలో చేపట్టి పెంపొందించిన నీటి పారుదల సౌకర్యాలు, వ్యవసాయాధారిత చేతి వృత్తులు, పరిశ్రమలు, అప్పటి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి సమాజాన్ని ప్రభావితం చేశాయి. ఆ సంప్రదాయ మతశాఖలు, సూఫీ, భక్తి ఉద్యమాలు, వైదిక మతాచారాలను నిరసించి, రాజ్యాధికారాన్ని ప్రశ్నించాయి. ఇదే కాలంలో, వీటి ప్రభావంలో విలక్షణ మైన సంకీర్ణ సంస్కృతి నిర్మితమైంది. వివిధ ఉద్యమాల అంతస్సంబంధాలను, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలకు మధ్య నెలకొన్న పరిస్థితులకును సామాజిక వ్యవస్థ గూర్చి వివరించడానికి బేరీజు వేసుకోవాల్సి వుంటుంది. సురవరం గ్రంథాన్ని యింకా సమగ్రం చేయడాన్కి, కాకతీయుల పూర్వ తెలుగువారి సమాజాన్ని గూర్చి రాయాల్సి వుంది. ఆధునిక యుగాన్ని గూర్చి రేఖా మాత్రంగా వారు చేసిన కృషిని పూరించాల్సి వుంది. విడివిడిగా ఒక్కో యుగాన్ని గూర్చో, లేక ఒక రాజవంశ కాలాన్ని గూర్చో గ్రంథాలు వచ్చాయి. మొత్తం ఆంధ్రుల సమగ్ర సాంఘిక చరిత్ర యింకా రావాల్సే వుంది. సురవరం చూపిన బాటను అనుసరించి, యీ కర్తవ్యాన్ని పూరించాల్సిన అవసరాన్ని ఖండవల్లి లక్ష్మీరంజనం గారితో పాటు పలువురు చెప్పారు. సురవరం వారి కృషికి మల్లంపల్లి వారు ప్రశంసాపూర్వకంగా శ్రీ రెడ్డిగారు విశాలాంధ్రకే మణిపూస' అంటూ అభినందించారు. సాంఘికచరిత్ర గ్రంథం వెలవడ్డాక నార్ల వెంకటేశ్వరరావు 'ఆంధ్రప్రభ'లో 'మన తాత ముత్తాతలు' అన్న శీర్షికతో సంపాదకీయం రాసి, 'ఒక జీవిత కాలపు ముక్తాఫలం'గా గ్రంథాన్ని పేర్కొన్నారు. రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ అభినందించి, చేసిన కొన్ని సూచనలను రెండో ముద్రణలో సరిచేశారు. సురవరం తెలంగాణ జాతీయ పునరుజ్జీవకానికి మాత్రమే వేగుచుక్క, వైతాళికుడు కాదు. మొత్తం తెలుగు జాతికి, తెలుగు భాషా చరిత్ర సంస్కృతులకు వైతాళికుడు. ■

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...)

## రచయిత గురించి ...



**బత్తుల వీ.వెం.అప్పారావు**
జి2 మణిమాల ఎస్టేట్,
151 మోతీనగర్, హైదరాబాద్ - 18
ఫోన్ : 23833798, 23833799

తొలి సంపుటి " మెరుపుల ఝుళుపులు" 1997 జూలైలో ప్రచురితం.
మలి సంపుటి "వామన కవితలు" 2003 జనవరి లో ప్రచురితం.
వివిధ పత్రికలలో వామన కవితలు దర్శనమిస్తూ వుంటాయి. తన చుట్టూ వున్న ప్రపంచంలోని, సమాజంలోని అంతర్గత వైరుధ్యాలను అసందర్భ విధానాలను తన అనుభవంతో జోడించి సామాజిక స్పృహను రంగరించి ఈ కవితలలో చిలకరిస్తున్నారు. ఈ వామన కవితలు మన సమాజంలోని వామనత్వాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఈ నెలలో మచ్చుకి కొన్ని కవితల్ని మీకు అందిస్తున్నాం.

# వామన కవితలు

మొక్కలకు మొదళ్ళు
మనుషులకు మెదళ్ళు
ప్రకృతి కుదళ్ళు

పైట మన సంస్కృతి
పడమటి గాలి లాగేసింది

రైతు ముట్టుకుంటే మట్టి
దళారీ పట్టుకుంటే కోటి

బిడ్డ పుట్టింది
తల ముందు పెట్టి
మనుషులతో తలపడటానికి

జెండాలు వేరు
దందా ఒకటే

ప్రైవేటూ, కాంట్రాక్టు
పాలకులకు రెండు కళ్ళు
ప్రజలది మూడోకన్ను

దున్నే వాడిదే భూమి
కబ్జాగాడిది సెజ్

జీవితాన్ని సముద్రాన్ని
పక్కపక్కన పెట్టి చూసా
కవిత్వం వెలవెలబోయింది

# స్వతంత్ర ఎమ్మెల్యేలకు ప్రత్యేక ప్రతిపత్తి

స్వతంత్ర ఎమ్మెల్యేలకు ప్రత్యేక ప్రతిపత్తి ఉంటుందని, మంత్రివర్గంలో చేరినప్పటికీ అధికారపార్టీలో వారు విలీనం అయినట్టు భావించలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నప్పుడు స్వతంత్ర ఎమ్మెల్యేల పై పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద చర్యలు చేపట్టలేమని పేర్కొంది. కర్ణాటకకు చెందిన ఐదుగురు స్వతంత్ర శాసనసభ్యులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ తీర్పునిచ్చింది. యడ్యూరప్ప సర్కారుకు మద్దతు ఉపసంహరించినందుకుగాను కర్ణాటక స్పీకర్ గత అక్టోబరులో వారి శాసనసభ్యత్వాన్ని రద్దు చేశారు. తాము భాజపాలో చేరనందున స్పీకర్ ఆదేశాలు తమకు వర్తించవని స్వతంత్ర ఎమ్మెల్యేలు హైకోర్టుకు వెళ్లినప్పటికీ వ్యతిరేకమైన తీర్పే రావటంతో వారు సుప్రీంను ఆశ్రయించారు. ఈ కేసుపై జస్టిస్ అల్తమస్ కబీర్, జస్టిస్ సిరియక్ జోసెఫ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. యడ్యూరప్ప సర్కారుకు మద్దతిచ్చి ప్రభుత్వంలో మంత్రులుగా చేరటంతోనే స్వతంత్ర ఎమ్మెల్యేలు తమ స్వతంత్ర ప్రతి పత్తి కోల్పోయారని తద్వారా వారంతా భారతీయ జనతా పార్టీలో చేరినట్లేనని స్పీకర్ లేవనెత్తిన అంశాలను ధర్మాసనం తిరస్కరించింది. వాళ్లు భాజపాలో చేరినట్టు భావించలేమని పేర్కొంది. స్పీకర్ ఆదేశాలను, హైకోర్టు తీర్పును కొట్టివేసింది. శాసన సభ్యులు తమ స్వతంత్ర ప్రతిపత్తిని ఎందుకు కోల్పోలేదో తెలియజేస్తూ త్వరలో పూర్తి వివరాలతో కూడిన తీర్పును ప్రకటిస్తామని తెలియజేసింది.

## అవీ... ఇవీ...

### ప్రభుత్వ విధానాల్లో న్యాయస్థానాల జోక్యం వద్దు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యాయస్థానాలు ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో జోక్యం చేసుకోజాలవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన విద్యా విధానాల్ని కొట్టివేస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు వెలువరించిన ఆదేశాల్ని జస్టిస్ పి. సదాశివం, జస్టిస్ బీఎస్ చౌహాన్‌లతో కూడిన ధర్మాసనం పక్కన పెట్టేసింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ హిమాచల్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ ఆదేశాలు జారీ చేసింది. విద్యా విధానం అనేది ఎప్పటికప్పుడు మారుతుంటుందనీ, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కోర్సులు మారుతుండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. కళలు, గ్రంథాలయ శాస్త్రం, శారీరక శిక్షణ వంటి కోర్సులను ప్రైవేటు సంస్థలు నిర్వహించకూడదంటూ హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు సవాలు చేశాయి.

### అవివాహిత హిందూ మహిళకు ఆస్తిలో సమాన వాటా హక్కు : సుప్రీం

అవివాహిత అయిన హిందూ మహిళకు ఆమె కుటుంబానికి వంశపారంపర్యంగా వచ్చిన ఆస్తిలో సమాన వాటాహక్కు ఉందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సవరించిన హిందూవారసత్వ చట్టం ప్రకారం కుటుంబంలోని ఇతర పురుష సభ్యులతో పాటూ అవివాహిత అయిన మహిళకు కూడా సమాన వాటా హక్కు కచ్చితంగా ఉందని జస్టిస్.సింఘ్వి, జస్టిస్, రాధాకృష్ణన్‌లతో కూడిన ధర్మాసనం వివరించింది. వాస్తవానికి హిందూ అవిభాజ్య కుటుంబంలోని పురుష సభ్యులకు మాత్రమే ఇప్పటిదాకా పరిమితం చేసిన సహదాయాదిత్వహక్కు అవివాహిత అయిన ఆ ఇంటి ఆడపడుచులకు కూడా దక్కుతుందని వివరించింది. కర్ణాటక హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ... ప్రేమ అనే మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

**యూత్ ఫోరం**

నిర్వహణ

**కార్తీక్ చంద్ర**

# భారత రిపబ్లిక్‌లో.... నయా రాచరికం !

## సాంప్రదాయ పార్టీలలో రాజకీయ వారసులు అలియాస్ ... "యువ నాయకులు"

**మొత్తం 545 లోక్‌సభ ఎంపీలలో...**




- లోక్‌సభలో అధికార పక్షమైన కాంగ్రెస్‌లో : 208 ఎంపీలలో 78 మంది కుటుంబవారసులే
- ప్రధాన ప్రతిపక్షమైన బిజేపీలో : 116 ఎంపీలలో 22 మంది కుటుంబవారసులే

- కుటుంబ వారసులుగా ఎంపీలు అయిన వారి సగటు వయస్సు 48 సం॥
- రాజకీయ నేపథ్యం లేని ఎంపీల సగటు వయస్సు 58 సం॥
- 30 సం॥ లోపు 100% "యువ" ఎంపీలూ కుటుంబ వారసులే
- 40 సం॥ లోపు "యువ" ఎంపీలలో 66% ఎంపీలు కుటుంబ వారసులే




35 సం॥ లోపు కాంగ్రెస్ ఎంపీలలో కుటుంబ వారసులు = 100%

## కాంగ్రెస్ పార్టీలో వారసత్వ నాయకత్వం....

**కాంగ్రెస్ ఎం.పీ.లలో....**






# మరి ప్రాంతీయ పార్టీలలో ?



= రాష్ట్రీయ లోక్‌దళ్ (అజిత్‌సింగ్) కి చెందిన 5 గురు ఎంపీలూ నేరుగా రాజకీయ వారసులే



= నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్) లో 9 ఎంపీలలో 7 గురు రాజకీయ వారసులే



= జమ్ము - కాశ్మీర్ నేషనల్ ఫ్రంట్ 3 ఎంపీలలో 2 వారసులే



= శిరోమణి అకాలీదళ్ (పంజాబ్) కి చెందిన 4గురు ఎంపీలలో ఇద్దరు రాజకీయ వారసులే



= బిజూ జనతాదళ్ పార్టీ (ఒడిషా) కి చెందిన 14 ఎంపీలలో 6గురు రాజకీయ వారసులే

 = వారసత్వంగా ఎంపీలు అయినవారు

 = రాజకీయ నేపథ్యం లేని ఎంపీలు

★ ప్యాట్రిక్ ఫ్రెంచ్ రాసిన ఇండియా : ఏ పోర్ట్రెట్ నుండి

 = రాయల్ ఫ్యామిలీకి చెందిన ఎంపీలు

 = స్టూడెంట్ పాలిటిక్స్ నుండి రాజకీయంలోకి వచ్చినవారు

 = సినిమాల నుండి నేరుగా ఎంపీలు అయినవారు

■

# స్వామినాథన్ కమిషన్ సిఫారసులు

***ప్రఖ్యాత వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త డా॥ ఎం.ఎస్. స్వామినాథన్ అధ్యక్షతన రైతుల జాతీయ కమీషన్‌ను భారతప్రభుత్వం నియమించింది. ఈ కమీషన్ 2006లో తన నివేదికను సమర్పించింది. ప్రభుత్వం ఉన్నంత వరకు ఈ నివేదిక సిఫారసులను అమలు చేయడానికి ముందుకు రావడం లేదు. ఈ కమీషన్ చేసిన కొన్ని ముఖ్య సిఫారసులను సెంటర్ ఫర్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ సలహదారు సి. కె. రామసుబ్బారెడ్డి సంక్షిప్తంగా క్రోడీకరించారు.***

**కనీస మద్దతు ధర ఉత్పత్తి వ్యయం కన్నా 50 శాతం అధికంగా వుండాలి.**

వ్యవసాయ ఖర్చులు, ధరల నిర్ణాయక కమిషన్ (సి.ఎ.సి.పి) స్వయం ప్రతిపత్తి గల చట్టబద్ధ సంస్థగా వుండాలి. మెట్టలో మగాణిలో పండించే వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలను సిఫారసు చెయ్యడం ఈ సంస్థ ప్రధాన బాధ్యతగా వుండాలి. కనీస మద్దతుధర రైతుల ఉత్పత్తి ఖర్చుల మీద కనీసం 50 శాతం అధికంగా వుండాలి. రైతులు ''ఇంటికి తీసుకువెళ్లే ఆదాయం'' ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలతో సరిపోల్చ దగినదిగా వుండాలి. వ్యవసాయం మనుగడనీ, రైతుల ఆస్తిత్వాన్ని పరిరక్షించే విధాన పరమైన సాధనంగా ఈ సంస్థ వుండాలి. మార్కెట్ అను సంధానాన్ని ముందుగా నికరం చేసుకున్న తర్వాతే పంటల మార్పిడిని సూచించాలి. సి.ఎ.సి.పిసంస్థలో వ్యవసాయ దారులుగా వున్న స్త్రీ, పురుషులకు సభ్యత్వాన్ని కల్పించాలి. ఈ సంస్థ పరిగణించే అంశాలను, సంస్థహోదాని సమీక్షించి, తగిన మార్పులు చేయడం అవసరం.



**ఎం.ఎస్. స్వామినాథన్**

కనీస మద్దతు ధరలను అన్ని ప్రధాన పంటలకు విస్తరింప జెయ్యాలి. చిన్న రైతులకు ఆదాయ భద్రత కల్పించేదిగా వుండాలి. కనీస మద్దతు ధరలను నిర్దిష్టమైన సమయంలో ప్రకటించే ఏర్పాట్లు చెయ్యాలి.

**మద్దతు ధరకు నికరమైన మార్కెటింగ్ ఏర్పాట్లు**

కనీస మద్దతుధర యంత్రాంగాన్ని దేశవ్యాపితంగా విస్తృత పర్చాలి. సమర్ధవంతంగా అమలు చెయ్యాలి. పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులకు అనుగుణంగా మద్దతుధర వుండాలి. ధరలలో తీవ్రమైన హెచ్చుతగ్గులు వుండే సమయాలలో రైతులను ఆదుకోడానికి వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్థిక సంస్థలు కలిసి ''ధరల స్థిరీకరణ నిధిని'' ఏర్పాటు చెయ్యాలి. ఉదాహరణకు త్వరగా పాడైపోయే ఉల్లిపాయలు, బంగాళా దుంపలు, టమోటాలకు ఈ ఏర్పాటు తప్పనిసరిగా ఉండాలి.

పండించే పంటల ఆధారంగా రైతుల సంఘాలను ఏర్పాటు చెయ్యాలి. సన్నకారు రైతులతో పత్తి ఎస్టేట్లు, పండ్లతోటల ఎస్టేట్లు, పౌల్ట్రీ ఎస్టేట్లు, ఔషధ మొక్కల ఎస్టేట్ల ఏర్పాట్లను ప్రోత్సహించాలి. ఈ తరహా రైతు సంస్థల ఏర్పాటు ద్వారా ఉత్పత్తిలో వికేంద్రీ కరణకూ కేంద్రీకృతంగా సేవలు అందించడానికి వీలుపడుతుంది. కేంద్రీకృత సేవలు అంటే పంటవసూళ్ల తర్వాత వాటిని నిల్వ చేసుకోవడం, ఆ ఉత్పత్తులకు అదనపు విలువ చేకూర్చడం, మార్కెట్ చెయ్యడం వంటి పనులకు వివిధ సంస్థల సహాయాన్ని పొందడానికి, రైతులకీ వినియోగదారులకీ మధ్య దళారులను తొలగింపుకు దోహదం చేస్తాయి.

ఇలా వివిధ పంటలు పండించే రైతు సంస్థలు ప్రధాన పాత్రధారులుగా వుండే మార్కెట్ వ్యవస్థ ఏర్పడుతుంది. ఇది రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచుతుంది. వాస్తవానికి పండించిన పంటలకు అదనపు విలువ కల్పించే క్రమంలో వివిధ స్థాయిల రైతు సంఘాలు చాల అవసరం. చిన్న రైతులు, సన్నకారు రైతులు పంట కోసిన వెంటనే అమ్ముకోవలసిన

పరిస్థితి వల్ల కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల వల్ల బాగా నష్టపోతున్నారు.

**రైతులకు మౌలిక సదుపాయాల పెట్టుబడి నిధి (ఐ.ఐ.ఎఫ్.ఎఫ్)**

గత మూడు పంచవర్ష ప్రణాళికల కాలంలో వ్యవసాయరంగం పెట్టుబడులు దాదాపు స్థంభించి పోయాయి. రైతుల మౌలిక సదుపాయాల పెట్టుబడి నిధిని (ఐ.ఐ.ఎఫ్.ఎఫ్)ను ఏర్పాటు చెయ్యాలి. దీనిని రైతులకు ఉపకరించే మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలి. రైతుల ఆదాయాన్ని పెంపొందించే పథకాలే ఈ నిధికి లక్ష్యంగా వుండాలి. అలాగే రైతుల ఉత్పత్తుల మార్కెటింగ్‌ను మెరుగు పరిచేదిగా వుండాలి. ఈ నిధిని రైతుల అభివృద్ధి పత్రాలను జారీ చెయ్యడం ద్వారా లేదా ఇతరత్ర వనరుల సమీకరణ పద్ధతుల ద్వారా సమకూర్చుకోవాలి.

**రుణాలు, బీమా :**

2. వ్యవసాయ రంగాన్ని ఉన్నత స్థితికి చేర్చడానికి, గ్రామీణ పరిశ్రమలు ఆగ్రి బిజినెస్‌కు ఉపాధికి ఉన్న అవకాశాలకు తగినట్లుగా బ్యాంకులు రుణాలను అందించాలి. దీనికోసం 4 శాతం వడ్డీకి రుణాలు ఇవ్వాలి. వ్యవసాయం నష్టం ఎక్కువగా కలగడానికి అవకాశం ఉన్న ఆర్థిక కార్యకలాపం. అనావృష్టి పీడిత ప్రాంతాలలో రుణాలు కేవలం పంట కాలానికి మాత్రమే కాకుండా నాలుగైదేళ్ల పాటు కొనసాగే రుణ వలయంగా ఉండాలి. దీనిలో వినియోగ రుణాలు కూడా ఉండాలి. బ్యాంకులు ఉదారంగా తనఖా రుణాలు ఇవ్వాలి. అయితే గుర్తింపు పొందిన గిడ్డంగులు ఎక్కువగా లేవు, అందువల్ల రైతులు తమ ఉత్పత్తులను తామే నిలవ చేసుకోవడంపై ఆధారపడవలసి ఉంటుంది. అయితే వీటికి కూడా బ్యాంకులు తనఖా రుణాలను ఇవ్వాలి.

**జీవనోపాధి రుణాలు:** పేదలకు నిలకడగా జీవనోపాధి సదుపాయాలు కల్పించడానికి సమగ్రమైన విధానం అనుసరించడం తక్షణావసరం. దీనిలో ఈ అంశాలు ఉండాలి.

(1) ఆర్థిక సేవలు (జీవితభీమా, ఆరోగ్యం, పంటలు - పశు సంపదకు భీమా)

(2) మౌలిక సదుపాయాలు (రోడ్లు, విద్యుత్తు, మార్కెట్లు టెలి కమ్యూనికేషన్లకు రుణాలు)

(3) మానవాభివృద్ధి, వ్యవసాయం మరియు వ్యాపారాభివృద్ధి సేవల కోసం పెట్టుబడులు (ఉత్పాదకత పెంపు, స్థానికంగా అదనపు విలువ సమకూర్చడానికి, ప్రత్యామ్నాయ మార్కెటింగ్ సదుపాయాలు ఉండాలి)

(4) సంస్థాగత అభివృద్ధి సేవలు (స్వయం సహాయక బృందాలు, నీటి వినియోగ దారుల సంఘాలు, ఆటవీ సంరక్షణ సంఘాలు, రుణం, వస్తు సేవల సహకార సంఘాలను ఏర్పాటు చెయ్యడం. వాటిని బలోపేతం చేయడం. సామర్థ్యాన్ని పెంచడానికి, విజ్ఞాన కేంద్రాల ద్వారా సమర్థతను పెంచే కార్యకలాపాల ద్వారా పంచాయితీలకు సాధికారత కల్పించడం.)

భీమా లేకుండా రుణాలు ఇవ్వడం ప్రమాద కారకం అవుతుంది. విత్తిన దగ్గర్నుంచి పంట కోసిన తర్వాత నిర్వహించే కార్యకలాపాలు, మార్కెట్‌లో ఎదురయ్యే వడిదుడుకులను కూడా దృష్టిలో ఉంచుకుని దేశ వ్యాప్తంగా రైతులందరికీ అనువైన భీమా పథకాలు ఉండాలి. అప్పుడే వారు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోకుండా ఉంటారు. వ్యవసాయం ఆర్థికంగా గిట్టుబాటు అవుతుంది. అనావృష్టికి గురయ్యే ప్రాంతాలలో పంట రుణాలు చెల్లించే గడువు 4-5 సంవత్సరాలదాకా ఉండాలి. అంటే నష్టాన్ని భరించగలిగే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ గడువు నిర్ణయించాలి. వ్యవసాయ భీమా విధానాల విస్తృతి పెరగాలి. పరివార్ బీమా విధానం కింద పేర్కొన్నట్టు ఆరోగ్య బీమా కూడా ఉండాలి. జన్యుమార్పిడి పంటల విషయంలో విత్తనాల కంపెనీలే బీమా సదుపాయం కల్పించాలి.

పశువులకు, పంటలకు, మనుషుల జీవితాలకు వన్య ప్రాణుల వల్ల నష్టం కలిగినప్పుడు పరిహారం చెల్లించే పద్ధతి ఉండాలి. మానవుల ప్రాణాలకు, పశువుల, పంటనష్టానికి పరిహారం చెల్లించే అంశాలను రాష్ట్రాలు పున్ణపరిశీలించాలి.



**గ్రామీణ ఇంధనం :**

3.గ్రామీణ కుటుంబాల వారి అవసరాలను సంపూర్ణంగా తీర్చడానికి సమీకృత గ్రామీణ ఇంధన పథకం. 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో అమలు పరచాలి. బయోగ్యాస్ మొక్కలు, సౌర విద్యుత్ సాంకేతికత, బయోమాస్‌తో గ్యాస్ తయారీ, చిన్న జలవిద్యుత్, జీవ ఇంధన సాంకేతికత వంటి పునరుత్పత్తి ఇంధనాల మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తులను శుద్ధి చేయడంతో సహా వ్యవసాయేతర పరిశ్రమలకు కూడా ఇలాంటి ఇంధనం అందుబాటులో ఉండడం అవసరం.

**సామాజిక భద్రత :**

4. జీవనోపాధికి భద్రత కల్పించడానికి రైతులకు ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు, భూమి లేని వ్యవసాయ కార్మికులను సమగ్ర జాతీయ సామాజిక భద్రత పరిధిలోకి తీసుకురావాలి. కుటుంబంలో ఒక వ్యక్తి అనారోగ్యానికి గురైతే ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకోవాల్సి వచ్చినప్పుడు, ప్రసూతి సమయంలో పరిమితికి లోబడి ఖర్చులను భరించడానికి అనువైన పథకం ఉండాలి. జీవిత బీమా, వృద్ధాప్య పింఛన్లు ఉండాలి. ఈ బీమా వృత్తి పరమైన ప్రమాదాలకు కూడా వర్తింపచేయాలి. దీనికి తోడు చేపలు పట్టేవారికి చేపల వేటకు అవకాశం లేని సమయంలో నెలకు కనీసం రూ॥1500 భత్యం చెల్లించాలి.

**భారత వాణిజ్యసంస్థ :**

5. జీవనోపాధి భద్రతా వ్యవస్థను నిర్వహించడానికి ప్రభుత్వానికి సహాయ పడడానికి భారత వాణిజ్య సంస్థను నెలకొల్పాలి. ప్రభుత్వం తన అంతర్జాతీయ విధానాలను రైతులకు ప్రయోజనకరంగా వారి స్థానిక కార్యకలాపాలతో అనుసంధానం చేయాలి.

న్యాయమైన వాణిజ్యం కొనసాగడానికి రైతుల ప్రయోజనాలను కాపాడడానికి భారత వాణిజ్య సంస్థను నెలకొల్పాల్సిన అవసరం ఉంది. జీవనోపాధి భద్రత వ్యవస్థకు నష్టం కలగకుండా దిగుమతులపై ఆంక్షలు విధించే సదుపాయం, దిగుమతి సుంకాలను పెంచే అవకాశం ఉండాలి. రైతు కుటుంబాల ఆదాయ భద్రతకు భంగం కలిగించే కొన్ని వస్తువుల దిగుమతిని నియంత్రించే సదుపాయం ఉండాలి. పెట్టుబడి, సబ్సిడీ, సాంకేతికత సహాయంతో వ్యవసాయరంగంలో భారీ ఉత్పత్తి చేయగలిగిన ప్రపంచ దేశాలతో మనకు పోలిక లేదు. భారత్‌లో వ్యవసాయ రంగంలో మద్దతు సేవలు బలహీనంగా ఉన్నాయి. రైతులు భారీ రుణాలభారంతో ఉన్నారు. సాంకేతిక వనరుల అందుబాటులో లేవు. కనక ప్రపంచదేశాలతో సమాన స్థాయి లేదు అనే అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. భారతదేశమంతటికీ ఒకే రకమైన మార్కెట్ వ్యవస్థను ఏర్పాటు చెయ్యాలి. ఇది రైతులకు అనువైన స్థానిక మార్కెట్లను కల్పిస్తుంది. వ్యవసాయం మీద ఆధారపడిన కుటుంబాల సంక్షేమం, జీవనోపాధి భద్రతకు అనుకూలమైన రీతిలో మన వాణిజ్య విధానాలు ఉండాలి.

**రైతుల ఆదాయ స్థితికి కూడా కొలమానం:**

6. రైతు కుటుంబాల నికర ఆదాయం పెరుగుదల ఆధారంగా వ్యవసాయాభివృద్ధిని లెక్క కట్టాలి. ఉత్పత్తిలో వృద్ధి రేట్లతో పాటు రైతుల ఆదాయాభివృద్ధి రేట్లు కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆర్థిక గణాంక డైరెక్టరేట్ ఈ రైతుల ఆదాయాభివృద్ధి రేట్లను ప్రకటించాలి.

**రైతుల సంక్షేమ మంత్రిత్వశాఖ :**

7. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ప్రస్తుతం ఉన్న వ్యవసాయ మంత్రిత్వ శాఖల / విభాగాల పేర్లను మార్చాలి. వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వశాఖ / విభాగాలుగా పునర్నిర్మించాలి. భారత జనాభాలో 60 కోట్ల మందిగా ఉన్న రైతుల ఆదాయాల/ పని భద్రతల కీలక పాత్రను ఎత్తిచూపడానికి ఇది అత్యవసరం. ఈ మంత్రిత్వశాఖలు ఉన్నత స్థాయిలో నిర్దిష్టమైన సమయంలో నిర్దిష్టమైన లక్ష్యాలు సాధించడానికి, చేపట్టే కార్యక్రమాలలో రైతుప్రతినిధులను సభ్యులుగా చేర్చాలి. దీనివల్ల రైతులను కేవలం లబ్ధిదారులుగా మాత్రమే చూసే ఆలోచనా ధోరణికి బదులు రైతులను వినూత్నమైన ప్రయోగాలు చేసే వారుగా, ప్రణాళికలు, రూపొందించ గల వారుగా, అందరికీ బతుకునిచ్చే వారుగా పరిగణించడం సాధ్యం అవుతుంది. వ్యవసాయం కేవలం పట్టణ ప్రాంతాల జనాభా కోసం ఆహారాన్ని ఉత్పత్తి చేసే యంత్రంగా కాకుండా నైపుణ్యాలు కలిగినదిగా, లాభసాటి ఉపాధివ్యాసంగంగా ప్రపంచానికి ఔట్‌సోర్సింగ్ కేంద్రంగా గుర్తించడానికి వీలవుతుంది.

**వ్యవసాయాన్ని ఉమ్మడి జాబితలో చేర్చాలి:**

8. ఏడవ షెడ్యూలులోనూ, రాజ్యాంగంలోని 246 అధికరణంలోనూ వ్యవసాయాన్ని ఉమ్మడి జాబితాలో చేర్చే అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించాలి. ధరలు, రుణాలు, వాణిజ్యం మొదలైన ముఖ్యమైన విధాన నిర్ణయాలను కేంద్రం తీసుకోవాలి.

**పంచాయితీలకు బాధ్యత :**

9. రాజ్యాంగంలోని 11వ షెడ్యూలు (73వ రాజ్యాంగ సవరణ), 213–జి అధికరణం వ్యవసాయాన్ని, వ్యవసాయ విస్తరణ కార్యక్రమాల బాధ్యతను కూడా పంచాయితీలకు అప్పగించాయి.

పంచాయితీలు ఈ బాధ్యతను నిర్వర్తించడానికి వాటికి అవసరమైన సమాచారాన్ని, శిక్షణను, ఉపకరణాలను సమకూర్చాలి. ప్రస్తుతం దేశంలో 2,25,000 పంచాయితీలు ఉన్నాయి. భారత రైతులు ఎదుర్కునే సమస్యలను ఏకమొత్తంగా పరిగణిస్తున్నారు. అంటే 100 మిలియన్ రైతు కుటుంబాల సమస్యలను ఒకే గాట కట్టి పరిశీలిస్తున్నారు. దీనివల్ల ఈ సమస్య అధిగమించరానిదిగా మారుతోంది.

అయితే ఈ సమస్యలను ఏక మొత్తంగా, ఒకే గాట కట్టి చూడకుండా వీటిని గ్రామసభలు, పంచాయితీలు నిర్దిష్ట స్థానిక సమస్యలుగా విడదీసి పరిష్కారాలను అలోచిస్తే ఈ సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడం సాధ్యం అవుతుంది. అందువల్ల 243-జి అధికరణంలోని అంశాలను అక్షరాల తు.చ తప్పకుండా అమలు చేయాల్సిన సమయం ఆసన్నం అయింది.

**వ్యవసాయ ప్రమాద నిధి ఏర్పాటు :**

10. తరచుగా సంభవించే అనావృష్టి, ఇతర వాతావరణ సమస్యవల్ల ఎదురయ్యే ముప్పునుంచి కాపాడాడానికి వ్యవసాయ ప్రమాద నిధి ఏర్పాటు చేయాలి.

**జాతీయ బోర్డు ఏర్పాటు :**

11. ప్రభుత్వం ప్రధాన మంత్రి అధ్యక్షతన బహుళ భాగస్వామ్యం గల జాతీయ ఆహారభద్రత, సర్వసత్తాక బోర్డును ఏర్పాటు చేయాలి.

12. ప్రతి రాష్ట్రంలోను రైతుల అధ్యక్షతన రాష్ట్ర రైతుల కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ఈ కమిషన్‌లో వ్యవసాయ రంగంలో ప్రధాన భాగస్వామ్యం ఉన్న వారందరికీ సభ్యత్వం ఉండాలి. ఈ కమిషన్లు ప్రతి ఏటా వార్షిక నివేదికలను శాసన సభలకు సమర్పించాలి. సభలో వాటి మీద చర్చలు జరగాలి. నిర్ణయాలు తీసుకోవాలి.

**భవిష్యత్ రైతులు :**

13. సమగ్ర పంటలు - పశు పోషణతో కూడిన వ్యవసాయ వ్యవస్థను ఏర్పాటు చేసి బహుళ జీవనోపాధి అవకాశాలను కల్పించే చిన్న స్థాయి వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించాలి. వ్యవసాయ ఉత్పత్తుల శుద్ధి, బయోమాస్‌కు అదనపు విలువ సమకూర్చడం వంటి లక్ష్యాలను సాధించడం రైతుల ఆదాయం పెంచడానికి అత్యవసరం.

**గ్రామీణ వ్యవసాయేతర జీవనోపాధి చర్యలు :**

14. దీనిలో మరింత మార్కెట్‌కు అనుకూలమైన, వృత్తి నైపుణ్యంగల కెవిఐసి, పునర్మించిన, ఆర్థికంగా పటిష్టమైన ఎస్ఎఫ్ఎసి వంటివి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయేతర పథకాలన్నింటినీ దీనిలో చేర్చాలి.

15. మెరుగైన వ్యవసాయ భూములను సేద్యానికే పరిమితం చేయాలి. వీటిని వ్యవసాయేతర కార్యకలాపాలకు, ప్రత్యేక ఆర్థిక మండళ్ల వంటి వాటికి మళ్లించకూడదు.

**మరికొన్ని సిఫార్సులు :**

సాధ్యమైనన్ని చోట్ల భూమిలేని వ్యవసాయ కార్మిక కుటుంబాలకు కనీసం ఒక ఎకరం భూమి కేటాయించాలి. వీటిని వారు పెరటితోటలకు, పశువుల పెంపకానికి ఉపయోగించుకోగలుగుతారు. ప్రస్తుతం నీటిపారుదల పథకాలు ఉన్న చోట సేద్యపునీటి వినియోగ సామర్థ్యాన్ని కనీసం 10 శాతం పెంచితే చాలా ప్రాంతాల్లో పంటలను సంరక్షించవచ్చు.

రాష్ట్రస్థాయిలో పశువులదాణా, నాణ్యమైన పశుగ్రాసం అందుబాటులో ఉంచడానికి ఒక సంస్థను ఏర్పాటు చేయాలి.

**విత్తనాలు :**

విత్తనాల కంపెనీల నుంచి సాంకేతిక మార్గదర్శకత్వం, శిక్షణ, విత్తన సాంకేతికతను తీసుకుని మహిళా స్వయం సహాయక బృందాలు ఆ కంపెనీలకోసం హైబ్రీడ్ విత్తనాలు ఉత్పత్తి చేయవచ్చు. ఒక వేళ విత్తనాలు కొత్తరకాలవైతే స్వయం సహాయక బృందాలకు మౌలికమైన విత్తనాలను సరఫరా చేయాలి.

**భూసారం :**

ప్రతి వ్యవసాయ కుటుంబానికి వున్న భూమిలో భూసార పరీక్షలు నిర్వహించి పాస్‌బుక్ ఇవ్వాలి. ఇందులో భూమి భౌతిక స్థితి, రసాయనాల పరిస్థితి, మైక్రోబయోలజీ వంటి అంశాల వివరాలు ఉండాలి.

**మహిళల మద్దతుకు సేవలు :**

లింగపరంగా నిర్దిష్టమైన అవసరాలు తీర్చడానికి సామూహిక కార్యకలాపాలు చేపట్టడానికి వీలుగా స్వయం సహాయక బృందాల కోసం గ్రామ పంచాయితీ మహిళా నిధి ఏర్పాటు చేయాలి. మహిళలకు ఇళ్లు, భూముల పట్టాలు ఇచ్చేంత వరకు వారు రుణ సదుపాయం పొందడానికి వీలుగా ఉమ్మడి పట్టాలు ఇవ్వాలి. ప్రస్తుతం ఉన్న విస్తరణ, సిబ్బందికి శిక్షణ, పునఃశిక్షణ సదుపాయం కల్పించాలి. రైతులు ఒకరినుంచి మరొకరు నేర్చుకునే అవకాశం ఉండాలి.

**జైకిసాన్**

మహాత్మాగాంధీ తనను తాను రైతు అని చెప్పుకోవడానికి ఇష్టపడేవారు. **'నన్ను నేను రైతుగా చెప్పుకోవడానికి ఇష్టపడతాన'**ని 1927లో బెంగుళూరులోని జాతీయ పాడిపరిశోధన సంస్థను సందర్శించినప్పుడు ఆయన సందర్శకుల పుస్తకంలో రాశారు. ఆయన ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా భారత్ రైతుల గురించి శ్రద్ధ తీసుకుంటుందని నిరూపిద్దాం. ■



# రైతు యువకులతో పెళ్లికి ఇష్టపడని అమ్మాయిలు

దేశానికి ఆహారాన్ని అందించి దేశ ఆర్థికవ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రైతు కష్టాలకు అంతం లేకుండా పోతోంది. పంటలు బాగా పండినా ప్రభుత్వాల దుర్మార్గపు విధానాలతో కృత్రిమంగా అణగదొక్కుతుండటం వల్ల తమ ఉత్పత్తులకు సరైన ధర లేక నలిగిపోతున్న రైతులకు ఇప్పుడు పెళ్లికి సరైన అమ్మాయి కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లోని వివాహబంధన్ అనే ఆన్‌లైన్ మ్యాట్రిమోనియల్ సేవల సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ దిగ్భ్రాంతికర వాస్తవం వెల్లడైంది.

పెళ్లికాని స్త్రీ,పురుషులు, వారి తల్లిదండ్రుల అవసరాలపై కులం, మతం, ఆర్థిక స్థితి ప్రాతిపదికన ఈ సంస్థవారు ఒక సర్వేను నిర్వహించారు. ప్రశ్నావళిలో పది ఎంపికల్ని ఉంచారు. ఇందులో తాము కోరుకుంటున్న అత్యంత ముఖ్యమైన అంశాలుగా ఐదింటిని పాల్గొనేవారు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఎంపికల్లో విద్య, ఆదాయం, ఉద్యోగం, వ్యవసాయం, సంప్రదాయ విలువలు తదితరాలు ఉన్నాయి. “దిగ్భ్రాంతికర విషయమేమంటే, పాల్గన్నవారిలో ఒక్కరంటే ఒక్కరు కూడా ఆ జాబితాలో వ్యవసాయాన్ని ఎంపికచేసుకోలేదు” అని వివాహబంధన్ ప్రతినిధి పి. సుబ్బారావు తెలిపారు. ఆరుగాలం ఎంతో కష్టపడుతున్నా కూడా సమాజంలో రైతుకతన గౌరవమర్యాదల్ని కోల్పోయినట్టు కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. మే 24, 2011న ‘ది హిందూ’ పత్రికలో తుమ్మల శ్రీ రమ్య అనే రిపోర్టర్ ఈ వార్తను అందించారు. వ్యవసాయంలో ఉన్న పాపానికి గ్రామాల్లో ఉన్న రైతు ఆదాయం ఏటా తలసరి రూ. 16,000 ఉంటే, వ్యవసాయేతర రంగాల్లో పట్టణాల్లో ఉన్నవారి తలసరి ఆదాయం రూ. 1,15,000 ఉందని లోక్‌సత్తా అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెవులు రింగుమనేలా చెబుతూ వస్తున్నారు. “సౌకర్యాలు, విలాసాలు మాట అలా ఉంచి కనీసం రెండు పూటలా సరైన భోజనం కూడా వ్యవసాయదారునికి గ్యారంటీ లేకపోవటం వల్లే పల్లె ప్రాంతాల్లోని ఏ రైతూ తన కూతుర్ని మరో రైతుకి ఇచ్చి పెళ్లి చేయటానికి లేదా తన కొడుకుని వ్యవసాయ వృత్తిలోకి తీసుకురావటానికి ఇష్టపడటంలేదు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రాజకీయ నేతల్లో, ప్రజాప్రతినిధుల్లో ఎంతమంది వ్యవసాయం చేస్తున్నారు? ఎంతమంది తమ పిల్లల్ని వ్యవసాయదారులకిచ్చి పెళ్లి చేస్తున్నారు?” అని జేపీ ప్రశ్నిస్తే అసెంబ్లీలో నిశ్శబ్దమే తప్ప సమాధానం రాలేదు. ■

# తగ్గుముఖం పట్టిన ఆహార ద్రవ్యోల్బణం

ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టింది. పప్పు, తృణధాన్యాలు, గోధుమలు, కూరగాయల ధరలు పడిపోవడంతో ఆహార ద్రవ్యోల్బణ గణాంకాలు 18 నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. మే నెల 7తో ముగిసిన వారానికి ఆహార ద్రవ్యోల్బణ గణాంకాలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుతం ద్రవ్యోల్బణస్థాయి 7.47 శాతంగా నమోదు కాగా గత వారం 7.70 శాతం ఉన్నట్లు వెల్లడించింది. దీంతో ద్రవ్యోల్బణం అదుపు బ్యాంక్ ఆఫ్ ఇండియా చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చినట్లైంది. కాగా ఆహారేతర వస్తువుల ద్రవ్యోల్బణం ఏప్రిల్ 30 నాటికి 23.82కు దిగి వచ్చినట్లు కేంద్రం ప్రకటించింది. అంతకుముందు ఈ గణాంకాలు 28.62గా ఉన్నట్లు పేర్కొంది. ఇక తాజాగణాంకాల నేపథ్యంలో టోకు ధరలు సూచీ సైతం తగ్గవచ్చునే అభిప్రాయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ వెలిబుచ్చారు. అయితే వారం వారంతోపాటు నెలకోమారు వచ్చే ద్రవ్యోల్బణ గణాంకాలను తాము పరిగణలోకి తీసుకోమని ఏడాది మొత్తంలో నమోదయ్యే గణాంకాలను పరిశీలించే తమ భవిష్యత్ ప్రణాళిక ఉంటుందని ప్రణబ్ స్పష్టం చేశారు.




## భారతదేశం స్థూల దేశీయోత్పత్తి

| పరిశ్రమ | 2009-10 సత్వర అంచనాలు | 2010-11 సవరించిన అంచనాలు |
|---|---|---|
| వ్యవసాయం,అడవులు, మత్స్యపరిశ్రమ | 656,975 | 700,390 |
| గనుల తవ్వకం | 103,999 | 110,009 |
| తయారీ | 713,428 | 772,960 |
| విద్యుత్,గ్యాస్,నీటిసరఫరా | 88,654 | 93,665 |
| నిర్మాణం | 355,918 | 384,629 |
| వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ | 1,193,282 | 1,315,656 |
| ఫైనాన్సింగ్, బీమా, స్థిరాస్తి, వ్యాపార సేవలు | 771,763 | 848,103 |
| సామాజిక, సాంఘిక, వ్యక్తిగత సేవలు | 609,724 | 652,431 |
| **ఉత్పత్తికారకాల ధరల్లో జీడీపీ** | **4,493,743** | **4,877,842** |



# నల్గొండ జిల్లా లేఖ



**పి. భాస్కర్‌రావు**

నల్గొండ జిల్లా హైదరాబాద్ సంస్థానంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన జిల్లా తెలంగాణ సాయుధపోరాటంలో ఈ జిల్లాకు చెందిన నాయకులు ముందుండి 1946 నుండి 1951 వరకు ఐదుసంవత్సరాల పోరాట కాలంలో ఎన్నో పరిణామాలకు నాయకత్వం వహించారు. ముఖ్యంగా రావి నారాయణరెడ్డి, అరుట్ల రామచంద్రా రెడ్డి, భీమిరెడ్డినర్సింహరెడ్డి, ధర్మభిక్షం, మల్లు స్వరాజ్యం మొదలైనవారు. ఆనాడు ప్రజాకరకులైన జమీందార్లు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు, పెత్తందార్ల అధీనంలో ఉన్న లక్షలాది ఎకరాల పొలాలను పంచిపెట్టడానికి భూసంస్కరణల ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు. హైదరాబాద్ సంస్థానం భారతయూనియన్‌లో విలీనమైన తర్వాత, జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో విజయ ధంకా మోగించారు. ముఖ్యంగా శ్రీ రావినారాయణ రెడ్డిగారు నల్గండ పార్లమెంట్ స్థానం నుండి దేశములోనే అత్యధిక మెజారిటీ సాధించిన అభ్యర్థిగా రికార్డు సృష్టించారు. అలాగే మెజారిటీ అసెంబ్లీ స్థానాలలో కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థులు గెలిచారు. 1952 నుండి 1962 సాధారణ ఎన్నికల వరకు కమ్యూనిస్ట్ పార్టీకి నల్గొండజిల్లా కంచుకోటగా ఉండేది.

1962 సంవత్సరం సాధారణ ఎన్నికల నుండి 1983 సంవత్సరం వరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఎక్కువగా అసెంబ్లీకి ఎన్నికైనారు. కానీ కమ్యూనిస్ట్ పార్టీ ప్రభావం మెల్లమెల్లగా తగ్గుతూ వచ్చింది. దాని ప్రధాన కారణం కమ్యూనిస్ట్ పార్టీలో చీలిక. ఈ జిల్లా నుండి అరుట్ల రామచంద్రారెడ్డి, అరుట్ల కమలాదేవి, ఉప్పలమల్సూర్, దొడ్డ నర్సయ్య, రావినారాయణరెడ్డి, ధర్మభిక్షం, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లుస్వరాజ్యం మొదలైనవారు శాసన సభకు/ పార్లమెంట్‌కు ఎన్నికై బడుగు బలహీనవర్గాలకు నిజమైన ప్రజా ప్రతినిధులుగా జిల్లాకు వన్నెతెచ్చారు.

1962 తర్వాత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ స్థానాలలో గెలిచి, కమ్యూనిస్ట్ పార్టీ యొక్క ప్రభావాన్ని కొంతమేరకు తగ్గించగలిగారు. కాంగ్రెస్ నుండి శ్రీ అక్కిరాజు వాసుదేవరావు, పురుషోత్తంరెడ్డి, పాల్వాయ్‌గోవర్ధన్‌రెడ్డి, జి.యస్.రెడ్డి, రామకృష్ణారెడ్డి మొదలైనవారు శాసనసభ / పార్లమెంట్‌కు ఎన్నికైనారు. 1960 ప్రాంతంలో పంచాయితీరాజ్ వ్యవస్థ అమలులోకి రాగ, జిల్లాపరిషత్ చైర్మన్‌గా ఎన్నికైన శ్రీ జి.యస్.రెడ్డిగారు జిల్లాని అభివృద్ధి పదంలో నడిపించారు. ముఖ్యంగా ప్రాథమికవిద్య/మాధ్యమిక విద్య, రహదారుల నిర్మాణం, విద్యుతీకరణ మొదలైన వాటికి అధిక ప్రాధాన్యం ఇచ్చి, అభివృద్ధికి బాటలు వేశారు. తర్వాత వారు మిర్యాలగూడ నుండి పార్లమెంట్ సభ్యునిగా రెండు సార్లు ఎన్నికై జిల్లా అభివృద్ధికి కృషి చేశారు.

1983లో శ్రీ నందమూరి తారకరామారావు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రభంజనంలో అత్యధికంగా శాసనసభ



**కె. జానారెడ్డి**



**కోమటిరెడ్డి వెంకట రెడ్డి**

నల్లగొండ జిల్లా నుండి మంత్రివర్గంలో

# నల్గొండ




## నియోజకవర్గాలు

1. దేవరకొండ
2. నాగార్జునసాగర్
3. మిర్యాలగూడ
4. హుజూర్‌నగర్
5. కోదాడ
6. సూర్యాపేట
7. నల్గొండ
8. మునుగోడు
9. భువనగిరి
10. నకిరేకల్
11. తుంగతుర్తి
12. ఆలేరు

మరియు పార్లమెంట్ స్థానాలను గెలుచుకొని కాంగ్రెస్ అధిపత్యానికి గండిపడింది. తెలుగుదేశం తరపున శ్రీ కె.జానారెడ్డి, మాధవరెడ్డి, వి.లక్ష్మీనారాయణ, సుదర్శన్, నర్సింహులు మొదలైన వారు అత్యధిక మెజారిటీతో ఎన్నికైనారు. 1983 తర్వాత జిల్లాలో బి.సిలకు మరియు బలహీనవర్గాలకు రాజకీయ ప్రాధాన్యత లభించి, అనేక పదవులకు ఎన్నికైనారు. 1983 నుండి ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీకి బలమైన నాయకులు, కార్యకర్తలు కల్గిన జిల్లాగా పరిగణించబడుతుంది.

2000 సంవత్సరం తర్వాత, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ నేపథ్యంలో 2001,2006లో జరిగిన పంచాయితీరాజ్ ఎన్నికలలో కానీ, 2004, 2009లో జరిగిన అసెంబ్లీ/ పార్లమెంట్ ఎన్నికలలో కానీ, తెలంగాణ రాష్ట్ర సమితి అభ్యర్థులకు తగినంత ప్రాతినిథ్యం లభించలేదు.

2004వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ / పార్లమెంట్ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ, జిల్లాలో కొంత మేరకు పట్టుకోల్పోయింది. 2009 అసెంబ్లీ/ పార్లమెంట్ ఎన్నికలలో తిరిగి పుంజుకొని పట్టుసాధించింది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో తెలుగుదేశం పార్టీ అస్పష్టవైఖరి కారణంగా గుత్తాసుఖేంధర్ రెడ్డి నాయకత్వంలో చాలా మంది కాంగ్రెస్‌లో చేరడంతో తెలుగు దేశం పార్టీకి నష్టం కల్గింది.

2009 లో జరిగిన అసెంబ్లీ/ పార్లమెంట్ ఎన్నికలలో నల్గండ, భువనగిరి పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ సొంతం చేసుకుంది. అసెంబ్లీ స్థానాలలో భువనగిరి, తుంగతుర్తి, కోదాడ స్థానాలను తెలుగుదేశం గెలువగా, మునుగోడు సి.పి.ఐ పార్టీ దక్కించుకుంది. మిర్యాలగూడ అసెంబ్లీ స్థానాన్ని సి.పి.ఎమ్.దక్కించుకోగా, నల్గొండ, దేవరకొండ, సాగర్, హుజూర్‌నగర్, సూర్యాపేట నకిరేకల్, ఆలేరూ కాంగ్రెస్‌కు సొంతం చేసుకుంది. తెలంగాణా రాష్ట్ర సమితికి ఈ జిల్లానుండి ప్రాతినిథ్యం లభించలేదు.

నల్గొండ జిల్లాకు వరప్రదాయినిగా నాగార్జునసాగర్ లెఫ్టకేనాల్, ఎలిమెనెట్ మాధవరెడ్డి లెఫ్టకెనాల్, దింది మరియు మూసీ నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా సాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ పూర్తిగా నకిరేకల్, సూర్యాపేట, దేవరకొండ, నల్గొండ ప్రాంతాలలో పాక్షికంగా నీటిపారుదల సౌకర్యంలో ఈ ప్రాంతాలు అభివృద్ధి పథంలో ముందున్నాయి. అలాగే పారిశ్రామికంగా సిమెంట్ మరియు రైస్‌మిల్లులు, ఫార్మస్యూటికల్ మొదలైన పరిశ్రమలతో సాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, నకిరేకల్ నియోజకవర్గాలు లబ్దిపొందాయి. హైదరాబాద్ నగరానికి దగ్గరగా ఉన్న భువనగిరి చౌటుపల్ ప్రాంతాలు పారిశ్రామికంగా మరియు రియేల్ఎస్టేట్ వ్యాపారాల వలన అభివృద్ధి చెందుతున్నాయి.

ముఖ్యంగా అభివృద్ధి నోచుకోని ప్రాంతాలుగా మునుగోడు, దేవరకొండ ప్రాంతాలుగా చెప్పవచ్చును. కారణం సరైన రవాణా, రహదారులు లేక ఇరిగేషన్ ప్రాజెక్టుల సదుపాయం లేక మరియు ఫ్లోరైడ్ సమస్య వలన అభివృద్ధి చెందని ప్రాంతాలుగా మిగిలిపోయాయి. జిల్లా నుండి ఇద్దరు మంత్రులున్నా ఇలాంటి మౌలిక సమస్యలు పరిష్కారం కావడం లేదు. ం

# నల్గొండ జిల్లా

**'మద్దతు' ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం**

**ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాలి.**

- **రైతు చైతన్య యాత్రలో ట్రాక్టర్ నడిపి కార్యకర్తలను ఉత్తేజపరిచిన లోక్‌సత్తా అధినేత, ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ్.**
- **మద్దతు ధర పెంచకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.**
- **ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు.**
- **రైతులు ఐక్యంగా పోరాడాలి.**
- **లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్‌నారాయణ్.**

**కోదాడ రూరల్ :** మే 17న చిలుకూరు, కోదాడ మండలంలోని గణపవరం ఐకెపి కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ధాన్యం అమ్మడానికి అష్టకష్టాలు పడుతున్న రైతులను పరామర్శించి ఆవేదన చెందారు. ఐకెపి కేంద్రాలు ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో విఫలమయ్యాయని, నల్గండ జిల్లాలో 11 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి రాగా కేవలం 2 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఐకెపి కేంద్రాల వద్ద గోనెసంచుల కొరతను నివారించి, ధాన్యం అమ్మిన రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గోనెసంచులు లేకపోవడంతో దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని వెంటనే ఐకెపి కేంద్రాల వద్ద వాటి కొరతలేకుండా నివారించాలి. తలపాగ చుట్టి రైతు వేషధారణలో ట్రాక్టర్ నడిపి కార్యకర్తలను ఉత్తేజపరిచారు.

ఆరు గాలం కష్టపడి పండించిన ధాన్యానికి మంచి ధర పలకాలంటే ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాలి. అన్నంపెట్టే రైతుకు ప్రభుత్వ విధానాలు శరాఘాతంగా మారాయన్నారు. ఐకేపీ కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని పదిరోజులైనా కొనే దిక్కులేదని, వర్షం వస్తే తడిచి మొలకెత్తుతుందని, నిర్వాహకులు బస్తాలు లేవంటున్నారిన రైతులు జేపీ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే జిల్లా కలెక్టర్ ముక్తేశ్వర రావుతో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో బస్తాలు వస్తాయని సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ జేపీకి తెలిపారు.

ధర మూడేళ్ల క్రితం నిర్ణయించిందని, ఈ మూడేళ్లలో పెట్టుబడి ఖర్చులు పెరిగినా మద్దతు ధరను పెంచకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని జయప్రకాష్ నారాయణ్ విమర్శించారు. రైతులను ప్రకృతి వైపరీత్యాలకంటే ప్రభుత్వాల పాపాలే బలితీసుకుంటున్నాయని మన ప్రజల ఆహారవసరాలకు మించి ఉన్న ధాన్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసి తద్వారా వచ్చిన లాభాలను రైతులకు పంచవచ్చునని తెలిపారు. ఈ విషయాన్ని ప్రధానితో సహా ప్రధాని ఆర్థిక సలహాదారుకు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు, సీఏపీసీ చైర్మన్, కేంద్ర వ్యవసాయ, ఆర్థిక మంత్రులకు చెప్పానన్నారు. అయినా అందుకు అవకాశం ఇవ్వకుండా, చర్యలు తీసుకోకుండా ఆహారభద్రత చట్టం పేరుతో 'మద్దతు ధర పెంచం, ధాన్యం ఎగుమతికి అవకాశం ఇవ్వం'



అని కేంద్ర వ్యవసాయ మంత్రి థామస్ అనడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇది ప్రభుత్వం చేస్తున్న పాపమే తప్ప ప్రకృతి శాపం కాదు. ప్రజల అవసరాలకు మించి రాష్ట్రంలో ఏడు కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు నిల్వ ఉన్నప్పటికీ బియ్యం ఎగుమతులకు అనుమతి ఇవ్వకపోవడం వల్ల రబీ ధాన్యానికి కనీస మద్దతు ధర కావడం లేదని ఆరోపించారు.

లోక్‌సత్తా నాయకులు బండారు రామ్మోహన్ రావు, పి.భాస్కర్‌రావు, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు మారేపలి సాతులూరి గోవిందరావు, పాడదుగు హుస్సెన్, రమేష్, వెంకట్రామిరెడ్డి, మోహన్‌రావు, అచ్యుత్, కడియం శ్రీనివాసరెడ్డి, పార్ధసారథ్లి శ్రీనివాసరెడ్డి, మహిళాసత్తా నాయకురాలు జ్యోతి, కొండల్ తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం జిల్లా

### గిట్టుబాటు ధరల కోసం శాశ్వత ఉద్యమం

వైరా : రైతు పండించిన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయాలకు అవకాశం కల్పించాలని చేస్తున్న ఆందోళన ఖమ్మం జిల్లా నుండి ప్రారంభం కానున్నదని లోక్‌సత్తా అధినేత డా॥ జయప్రకాష్ నారాయన్ అన్నారు. వైరాలో వరికి మద్దతు ధర కల్పించాలని మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడం కోసం కులాన్ని , మతాన్ని, పార్టీని పక్కన పెట్టి రైతు కోసం ఉద్యమాలు చేపట్టాలని అలా అందరు ముందుకొస్తే నాయకత్వం వహించి ఉద్యమాన్ని నడపడానికి మేము సిద్ధమన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా, రష్యా ఆహార పంటలకు ధర అధికంగా ఉండగా మన దేశంలో ఓటు బ్యాంక్ రాజకీయం కోసం ధరలు నిరోదకంగా మారాయిన ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ, కొనిజర్ల, ఏన్కూరు కుసుమంచి, నేలకొండపల్లిలలో జేపీ పర్యటించారు. ఐకెపి కేంద్రాల పనితీరును పరిశీలించారు.

ఈ కార్యక్రమలో లోక్‌సత్తా నాయకులు రవిమారుత్, జూపల్లి సత్యనారాయణ, సామినేని రాఘవులు, ఆంజనేయులు ప్రభృతులు పాల్గొన్నారు.

## కాకినాడలో లోక్‌సత్తా ఓటరు నమోదు ప్రారంభం

లోక్‌సత్తా పార్టీ నాయకులు నగరంలో స్థానిక రామారావుపేటలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు ప్రారంభించారు. ప్రజల సౌకర్యాలు మెరుగుపర్చని ఈ ప్రభుత్వానికి పన్నులు పెంచే అర్హతలేదని, పెంచిన పన్నులు చెల్లించవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి నగర కమిటీ అధ్యక్షుడు నెక్కంటి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి వర్మ, అడపా శంకర్, వాకాడ సుబ్బారావు, బిఎల్‌జి ప్రసాద్, పి. సుబ్రహ్మణ్యం, మందర గంగాధర్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




కాకినాడలో మున్సిపల్ ఓటర్ల నమోదు శిబిరం

# ప్లాస్టిక్ వాడకం నియంత్రణకై విశాఖలో విద్యార్థిసత్తా ఉద్యమం




**కార్పొరేషన్ :** జీవీఎంసీ పరిధిలో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నియంత్రించాలని కోరుతూ విద్యార్థిసత్తా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసీ భవనం నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ఇది సాగింది. ప్లాస్టిక్‌ను నియంత్రించండి... పర్యావరణాన్ని రక్షించండి అంటూ నినాదాలు చేశారు. జీవో నె. 25ను వెంటనే అమలు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. ప్లాస్టిక్ వాడకంలో పలు నిబంధనలు ఉన్నా జీవీఎంసీ వాటిని అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్ (సాధారణ) కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సత్తా అధ్యక్షులు ప్రసాద్, సభ్యులు స్నేహ, పూజిత, బుచ్చిబాబు, అనంత్‌రామ్, ఏధు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



### ప్లాస్టిక్ నిర్మూలనకు సంతకాల సేకరణ

ప్లాస్టిక్ వినియోగం అరికట్టాలని కోరుతూ విద్యార్థిసత్తా ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో సంతకాల సేకరణ కార్యక్రమం. నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే విపత్తులపై సందర్శకులకు అవగామన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థిసత్తా నగర అధ్యక్షుడు శశిధర్ అనిల్, యశ్వంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

## తూర్పుగోదావరి జిల్లా

### మున్సిపల్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలి

**కాకినాడ :** మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేయకుండా వెంటనే జరపాలని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు డిమాండు చేశారు. మున్సిపల్ ఎన్నికలకు లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలను సన్నద్ధం చేయడానికి రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా కాకినాడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఆలూరి విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లు 50 శాతం పెంచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నెక్కంటి శ్రీనివాసు, కార్యదర్శి రాజశేఖర వర్మ, వాకాడ సుబ్బారావు పాల్గొన్నారు.

### మునిసిపల్ ఎన్నికలు తక్షణమే జరపాలి

**మండపేట :** మండపేట మునిసిపాలిటీ పరిధిలోని లోక్‌సత్తా కార్యకర్తల సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి నియోజకవర్గ కన్వీనర్ రామకృష్ణారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్రకార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి లోక్‌సత్తా పార్టీ సన్నద్ధం కావాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు పాలడుగు చంద్రమౌళి, నియోజకవర్గ కన్వీనర్ రామకృష్ణారావు, సిద్దార్ధబక్ష్, జి. రత్తయ్య, పి. చంద్రశేఖర్, ఏలూరి కోటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### గుంటూరు : మున్సిపల్ పన్నుల పెంపును ప్రతిఘటించాలి

మున్సిపల్ పన్నుల పెంపును ప్రతిఘటించమని లోక్‌సత్తా పార్టీ చేసిన విజ్ఞప్తిని గుంటూరు నగరంలో ప్రజానీకానికందరికి అవగాహన కల్గించేందుకుగాను కరపత్రాల రూపంలో అచ్చువేయించి నగరంలోని ముఖ్య కూడళ్ళలోను, లైబ్రరీలు, దేవాలయాల దగ్గర, బస్టాండులలోను, హోటళ్ళవద్ద, హస్పటల్స్ వద్ద, అపార్టుమెంట్స్ వద్ద పంపిణీ చేసే కార్యక్రమంలో శ్రీవల్లూరి సదాశివరావు, డాక్టర్ టి. సేవాకుమార్, శ్రీకె. సాంబయ్య, యు.వి. సత్యనారాయణ మొదలగువారు పాల్గొన్నారు. ■









# జిల్లాల్లో జేపీ రైతు ఉద్యమ యాత్ర



RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



విజయవాడలో జరిగిన రాష్ట్ర లయన్స్ క్లబ్ సమావేశంలో డా॥ జయప్రకాష్ నారాయణ్

To,

**Book-Post**

PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**

H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad